ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 31.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 281 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

శ్రీలంక వైట్ వాష్... 8

ప్రజా సేవలో పోలీసులు భేష్

రాష్ట్రంలో అదుపులో శాంతిభద్రతలు

- 2.33 శాతం తగ్గిన క్రైమ్ రేట్
- 41శాతం పెరిగిన సైబర్ క్రైమ్
- బాధితులకు రూ.159.65 కోట్లు రిఫండ్
- 509 మంది మావోల లొంగుబాటు
- ఫోన్ ట్యాపింగ్‌లో ఎవరి పాత్ర ఉన్నా చర్యలు
- త్వరలో పోలీస్ నియామకాలకు కసరత్తు
- రాష్ట్ర పోలీస్ వార్షిక నివేదిక విడుదల చేసిన డీజీపీ శివధర్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్30: ప్రజా సేవలో తెలంగాణ పోలీసులు భేష్ అని, రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ వార్షిక నివేదికను డీజీపీ శివధర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించమని గుర్తు చేశారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో వచ్చిన వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని అన్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి వరదలు నిజామాబాద్‌లో రాలేదని, వరదల సమయంలో పోలీస్ సిబ్బంది బాగా పని చేసి ప్రాణ నష్టం లేకుండా చూశారని, పోలీసులు పని తీరును కొనియాడారు. తెలంగాణలో 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఎలాంటి సమస్యలు లేకుండా మిస్ వరల్డ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించుకున్నామని, ఫుట్ బాల్ ఆటగాడు మెస్సీ ఈవెంట్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, రాష్ట్రంలో వివిధ కేసులను లోక్‌అదాలత్‌లో పెద్ద సంఖ్యలో పరిష్కరించామని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో కీలక పదవుల్లో మహిళా అధికారులు పని చేస్తున్నారని అన్నారు. ఫోన్ల రికవరీ విషయంలో దేశంలో తెలంగాణ నంబర్ వన్‌లో ఉందని వివరించారు.

రాష్ట్రంలో తగ్గిన క్రైమ్ రేట్

సైబర్ క్రైమ్ విషయంలో తెలంగాణ రాష్ట్రంలో 3 శాతం ...:: మిగతా 2లో

“

ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేసుకున్నామన్నారు. క్యూర్ పరిధిలోని హైదరాబాద్‌సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించినట్లు తెలిపారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే మా ఆలోచన అని వివరించారు. ఈ మేరకు పురపాలక, నగరాభివృద్ధి విభాగం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

మహానగరంలో పౌర సేవలు మెరుగుపడాలి

నగరంలో ఎక్కడ కూడా చెత్త కనిపించొద్దు

- శానిటేషన్ పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి
- కాలుష్య నియంత్రణకు పూర్తిస్థాయి ప్రక్షాళన
- క్యూర్‌పరిధిలో ఈవీ బస్సులను నడపాలి
- కోర్ అర్బన్ రీజియన్ను అభివృద్ధి చేయాలి
- ధ్రువ పత్రాల జారీకి టెక్నాలజీని వాడాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం
- పురపాలక, నగరాభవృద్ధి విభాగం అధికారులతో సమీక్ష

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్30: మహానగర పాలక సంస్థ పరిధిలో పౌరసేవలు మెరుగు పరచాలని, పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ఎక్కడ కూడా చెత్త కనిపించొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు దశ, దిశానిర్దేశనం చేశారు. మంగళవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్లో పురపాలక, నగరాభవృద్ధి విభాగం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. పౌరసేవలు మెరుగు, రవాణా, పారిశుధ్యం, ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల

...:: మిగతా 2లో

నల్లమల సాగర్ పేరుతో జలదోపిడీకి కుట్ర

- చంద్రబాబు సూత్రధారి, రేవంత్ పాత్రధారి
- రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి కాదు.. జల ద్రోహి
- అసెంబ్లీలో నల్లమల సాగర్‌కి వ్యతిరేక తీర్మానం చేయాలి
- ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీ నుంచి తొలగించాలి
- తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం
- కేంద్రం, సీడబ్ల్యూసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 30: తెలంగాణలో గోదావరి జలాలను దోచుకునే ప్రయత్నాలు జరిగుతున్నాయని, ఈ కుట్రలో ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు సూత్రధారిగా, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్రధారిగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఆయన నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బనకచర్ల ప్రాజెక్ట్ నుంచి నల్లమల సాగర్‌కి నీటిని మార్చడం, గోదావరి జలాలను కృష్ణా, పెన్నా బేసిన్‌కి తరలించడం ద్వారా తెలంగాణకు దక్కాల్సిన వాటాను నిలిపివేయడానికి కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. “బనకచర్ల అయినా, నల్లమల సాగర్ అయినా జరుగేది తెలంగాణ జల దోపిడి మాత్రమే. నల్లమల సాగర్

...:: మిగతా 2లో

గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు

- జనవరి 22న హైకోర్టు తీర్పు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్30: హైకోర్టులో తెలంగాణ గ్రూప్ 1 కేసులో వాదనలు ముగిశాయి. గతంలో గ్రూప్ 1 ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి తీర్పును ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతోపాటు పలువురు ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లపై ఇవాళ హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరువైపులా వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ జనవరి 22న తీర్పు ఇస్తామని వెల్లడించారు. ఈ ఏడాది మూడో నెల 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంగింక్స్ లిస్ట్, మార్కుల జాబితాలో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ జాబితాను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీళ్లకు వెళ్లింది. టీజీపీఎస్సీ తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయన్నారు. మూల్యాంకనంలో అవకతవకలు జరగకూడదన్న లక్ష్యంతో ఇద్దరి చేత చేయించారని తెలిపారు. పరీక్ష కేంద్రాలు పెంపు, పరిపాలనాపరమైన

సౌలభ్యం కోసం ప్రిలిమ్స్, మెయిన్స్‌కు హాల్టికెట్లను వేర్వేరుగా జారీ చేసిందని చెప్పారు. పరీక్షల్లో కాపీయింగ్ జరిగిందని ఎలాంటి ఆరోపణలు లేవని వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థుల తరపున సీనియర్ న్యాయవాది డి. ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షల్లో అర్హత సాధించలేని వారు కోర్టును ఆశ్రయించారన్నారు. రెండు హాల్టికెట్లు ఉంటాయని పరీక్షలకు ముందే వెల్లడించినా అప్పుడు అభ్యంతరం చెప్పకుండా, ఫలితాలు విడుదలయ్యాక పిటిషన్ వేయడం చెల్లదన్నారు.



జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

- జీవో 252 సవరిస్తాం.. లిఖితపూర్వక హామీ ఇస్తాం
- అక్రిడిటేషన్, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదు
- త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్30: అక్రిడిటేషన్ కార్డులకు, మీడియా కార్డులకు ఎలాంటి తేడా లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అక్రిడిటేషన్ కార్డుదారులకు వర్తించే ప్రతి ప్రయోజనం మీడియా కార్డు దారులకు కూడా వర్తిస్తుందని తెలిపారు. ఈ విషయంలో డెస్క్ జర్నలిస్టులు ఎలాంటి అపోహలకు గురికావద్దని జీవో 252లో మార్పులు చేసి లిఖితపూర్వకంగా ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించి, తుది జీవోను రిలీజ్ చేస్తామని వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో టీడబ్ల్యూజేఎఫ్, డీజేఎఫ్‌టీ ప్రతినిధులు మంత్రి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం

...:: మిగతా 2లో

జీవో 252లో కొన్ని సవరణలు చేయండి

- మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే అభ్యర్థన

...:: 3లో

చొరబాట్లను నేషనల్ గ్రిడ్‌తో నిలువరిస్తాం

పశ్చిమబెంగాల్ లో బీజేపీ అధికారంలోకి వస్తే చొరబాటుదారులను వెనక్కి పంపుతామని కేంద్ర హోం మంత్రి హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. దేశంలోకి చొరబాటుదారులను నిలువరించేందుకు నేషనల్ గ్రిడ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

7

ఖలీదా జియా కన్నుమూత

బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ అధినేత్రి ఖలీదా జియా(80) మంగళవారం కన్ను మూశారు. గత అనేక సంవత్సరాలుగా ఆమె ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

7

2026లో మాట్లాడుకుందాం

ముఖ్యమంత్రి పదవిపై ఆశలు సజీవంగా ఉన్నట్టు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంకేతాలిచ్చారు. 2026లో సీఎం కానున్నారా అని మంగళవారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన నవ్వుతూ '2026లో మనం మాట్లాడుకుందా' అని సమాధానమిచ్చారు.

7

పుతిన్ నివాసంపై దాడిని ఖండించిన ప్రధాని మోడీ

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి డ్రోన్లతో దాడికి ప్రయత్నించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. శాంతికి దౌత్యం ఒక్కటే సరైన మార్గమని పేర్కొన్నారు.

7

రాష్ట్రీయం

ప్రజా సేవలో పోలీసులు భేష్

మొదటిపేజీ తరువాయి

తగ్గిందన్న శివధర్‌రెడ్డి దేశంలో సైబర్ క్రైమ్ 41 శాతం పెరిగిందని తెలిపారు. రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు సమర్థవంతంగా పని చేయడంతో 3 శాతం తగ్గిందని కొనియాడారు. గతంతో పోలిస్తే 2.33 శాతం క్రైమ్ రేట్ తగ్గిందని చెప్పారు. గతంలో 2.34 లక్షల కేసుల నమోదు కాగా ఇప్పుడు 2.28 లక్షల కేసులు నమోదయ్యాయని తెలిపారు. గతంతో పోలిస్తే శిక్ష పడిన కేసుల సంఖ్య 3 శాతం పెరిగిందని, ఈ ఏడాది నాలుగు కేసుల్లో మరణ శిక్షలు పడ్డాయని డీజీపీ గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా హత్యలు 8.76 శాతం తగ్గాయని, అత్యాచారాలు 13.45 శాతం తగ్గాయని, దోపిడీలు 27 శాతం తగ్గాయని, దొంగతనాలు 9.1 శాతం తగ్గాయని వివరించారు. నమ్మక ద్రోహం కేసులు 23 శాతం పెరిగాయని అన్నారు. వరకట్నం కోసం మహిళల హత్యలు తగ్గాయన్నారు. వరకట్న వేధింపుల కేసులు 2 శాతం తగ్గాయని తెలిపారు. మహిళా భద్రత కోసం షీటీంలు యాక్టివ్‌గా పని చేస్తున్నాయని పేర్కొన్నారు.

బాధితులకు రూ.159.65 కోట్లు రిఫండ్

ఎస్సీ, ఎస్టీ కేసులు 9.5 శాతం తగ్గాయని, సైబర్ క్రైమ్ కేసుల్లో రికవరీ 23 శాతం పెరిగిందని తెలిపారు. ఈ ఏడాది రూ.246 కోట్లు రికవరీ చేశామని, 24,498 మంది బాధితులకు రూ.159.65 కోట్లు రిఫండ్ కూడా చేశామని, త్వరలో పోలీస్ ఉద్యోగాల నియామకాల కోసం కసరత్తు చేస్తున్నామని వివరించారు. సుప్రీంకోర్టులో ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణ జరుగుతోందని, ఫోన్ ట్యాపింగ్‌లో ఎవరి పాత్ర ఉన్నా చర్యలు తీసుకుంటామని డీజీపీ స్పష్టం చేశారు.

జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

మొదటిపేజీ తరువాయి

అందించారు. ఈ సందర్భంగా మంత్రికి వివిధ అంశాలను వివరించారు. ఇటీవల రిలీజ్ చేసిన జీవో 252 ద్వారా రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులు, డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు ఇస్తామనే ప్రకటన వారిలో విభజన తెచ్చేలా ఉందని చెప్పారు. ప్రస్తుతమున్న పరిస్థితులలో డెస్క్ జర్నలిస్టులు కూడా ఫీల్డ్ వర్క్ చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ జీవోతో జర్నలిస్టులకూ భారీగా అక్రిటేషన్లు తగ్గే అవకాశం ఉందని, మహిళా కోటాను పునరుద్ధరించాలని మంత్రి దృష్టికి ఫెడరేషన్ నేతలు తీసుకుపోయారు. దీనిపై స్పందించిన మంత్రి శ్రీనివాస్ రెడ్డి.. జీవోపై కొంతమంది అపోహలకు గురిచేలా ప్రయత్నం చేస్తున్నారని, వాటిని నమ్మొద్దని స్పష్టం చేశారు. డెస్క్ జర్నలిస్టులు ఎవ్వరూ ఆందోళన చెందొద్దని, తాను అండగా ఉంటానని చెప్పారు. ఇది జర్నలిస్టులను రెండు భాగాలుగా చూడాలన్న ఆలోచన కాదనీ, ప్రభుత్వ పరంగా అందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని వెల్లడించారు. అర్హులైన, నిజమైన జర్నలిస్టులకు మేలు చేయాలన్న సంకల్పంతో తీసుకున్న నిర్ణయమన్నారు.

అన్ని జర్నలిస్టుల సంఘాలతో సమావేశం

తెలంగాణ రాష్ట్రంలో మినహా దేశంలో ఇంత పెద్దమొత్తంలో అక్రిడిటేషన్ కార్డులు ఇస్తున్న రాష్ట్రం మరొకటి లేదని వివరించారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే అన్ని జర్నలిస్టుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశానికి డెస్కు జర్నలిస్టులనూ ఆహ్వానిస్తామని తెలిపారు. అందరి అభిప్రాయాలు, సలహాలు సూచనలు తీసుకొని జర్నలిస్టులకు మరింత ప్రయోజనం చేకూరే విధంగా జీవో 252లో మార్పులు, చేర్పులు చేస్తామని స్పష్టం చేశారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి గండ్ర నవీన్, డీజేఎఫ్‌టీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్, ఎస్‌కే మస్తాన్, ట్రెజరర్ నిస్సార్, ఉపాధ్యక్షుడు రాజారామ్, జాయింట్ సెక్రెటరీ విజయ, స్పోర్ట్స్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, శ్రీనివాస్, జర్నలిస్టుల ప్రతినిధులు శేఖర్, సురేష్, వెంకటరమణ, రమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం

- తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్30: గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికితీయడం, క్రీడాకారులకు ప్రోత్సాహం ఇవ్వడం లక్ష్యంగా రెండో విడత సీఎం కప్-2025 పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడాభివృద్ధి అధికారులతో ఈరోజు నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 8, 9, 10, 11 తేదీల్లో జిల్లా కేంద్రాల్లో ఆయా జిల్లాల వెసులుబాటును బట్టి టార్చ్ రిలే (క్రీడాజ్యోతి) కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జనవరి 17 నుంచి గ్రామస్థాయి పోటీలు ప్రారంభమవుతాయని, గ్రామ, మండల, జిల్లా స్థాయిలతో పాటు మొట్టమొదటి సారిగా అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో కూడా ఈసారి పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొత్తం 44 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సారి సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు కేవలం హైదరాబాద్ నగరానికే పరిమితం కాకుండా ఉమ్మడి జిల్లా కేంద్రాలతో పాటు మరికొన్ని జిల్లాలకు విస్తరించి నిర్వహించనున్నట్లు శివసేన రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోని బాలాదేవి మాట్లాడుతూ, క్రీడాకారుల సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా సేకరించాలని, కలెక్టర్ల ఆధ్వర్యంలో వివిధ జిల్లా శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పీఈటీలు, ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీఎం కప్ పోటీలు విజయవంతం చేయాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, డాక్టర్ రవితేజ, ఎస్.ఎం. భాష, అనిత, సుజాత, పద్మావతి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఉషారాణి పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలి

- ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్
- ఎలికట్ట గ్రామ సర్పంచ్, సభ్యులకు సన్మానం

ప్రతిపక్షం, షాద్ నగర్, డిసెంబర్30 : ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ సూచించారు. హైదరాబాద్ రవీంద్ర భారతి వేదికగా ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం కి, బుద్ధ నరసింహకు ఘన సన్మానం చేశారు. ముఖ్య అతిథిలుగా మంత్రి వాకిటి శ్రీహరి, ఈటెల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్, బండ ప్రకాశ్, కాసాని వీరేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బుర్ర జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ప్రజా సేవతో ఆయా రంగాల్లో తమ సత్తా చాటి ప్రజల మనసు గెలుచుకోవాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్ర జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. సర్పంచులుగా తమ విధులు, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రమీల, ఈ శ్రీను, రాము, పి. బోనయ్య, సురేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో వైకుంఠ ఏకాదశి సందడి

- ఆలయాలకు పొటెత్తిన భక్తులు
- ఉత్తర ద్వార దర్శనాలు, వైకుంట ద్వార దర్శనాలతో తరించిన భక్తులు
- తిరుమల శ్రీవారి సేవలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్30: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాలకు భక్తులు పొటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార, వైకుంఠ ద్వార దర్శనంలో భక్తులు తరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీమహా విష్ణువు దర్శనానికి తరలివచ్చారు. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, విజయవాడ కనకదుర్గ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వైష్ణవి ఆలయాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

భద్రాచలంలో..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో ఘనంగా వైకుంఠ ద్వార దర్శనం వేడుక ప్రారంభమైంది. ఉత్తర ద్వార దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గరుడ వాహనంపై శ్రీరామచంద్రస్వామి వారు, గజ వాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై లక్ష్మణ స్వామి దర్శనమిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా మన్యం కొండ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. మూడు కొండలపై ఉన్న స్వామిని దర్శించుకుని తరించారు. రంగారెడ్డి జిల్లా జానం పేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పొటెత్తారు. గంటల తరబడి క్యూలైన్ లో ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు.

తిరుమలలో సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు సోమవారం తెల్లవారుజామున 1.30 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ఉత్తర ద్వారం గుండా బయటకు వచ్చారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన ఆయనకు తితిదే చైర్మన్ బీఆర్ నాయుడు, ఏపీ మంత్రులు కేశవ్, అచ్చన్నయుడు తో పాటు పలువురు అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలిచ్చారు. అలాగే శ్రీవారిని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సినీనటుడు చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా, తితిదే బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్లా, సినీనటుడు నారా రోహిత్ దంపతులు, క్రికెటర్ తిలక్ వర్మ, సినీ నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు దర్శించుకున్నారు.

మహానగరంలో పౌరసేవలు మెరుగుపడాలి

మొదటిపేజీ తరువాయి

చేసుకున్నామన్నారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించినట్లు తెలిపారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే మా ఆలోచన అని వివరించారు.

చెత్త నిర్వహణపైనే దృష్టి..

హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని సీఎం అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ ను ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుందన్నారు. జోన్ ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్ లదే అని సీఎం తెలిపారు. జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

నగరంలో ప్లాస్టిక్ నిషేధం...

జీహెచ్ఎంసీ పరిధిలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామని సీఎం తెలిపారు. ఇందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రేవంత్ ఆదేశించారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలన్నారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ వెహికిల్స్ ను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామన్నారు. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదన్నారు. రోడ్లపై గుంతలు కనిపించొద్దని ఆదేశించారు.

ధ్రువపత్రాల జారీలో నూతన టెక్నాలజీ ఉపయోగం

జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆన్ లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలన్నారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్ మెంట్ అసోసియేషన్ లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్ కు మారాలన్నారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలని ఆదేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. క్యూర్ ఏరియాలో విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని తెలిపారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ పది రోజులకో సారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్ కు వీలయినంత స్పీడ్ గా రెస్పాన్స్ అవ్వాలన్నారు. వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని ఆదేశించారు. అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని సీఎం కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

నల్లమల సాగర్ పేరుతో జలదోపిడీకి కుట్ర

మొదటిపేజీ తరువాయి

అక్రమ నిర్మాణానికి సూత్రధారి చంద్రబాబు, పాత్రధారి రేవంత్ రెడ్డి. కత్తి చంద్రబాబుది అయినా పొడిచే వాడు రేవంత్ రెడ్డి" అని ప్రస్తావించారు. రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి మాత్రమే కాదు, జల ద్రోహి అని పేర్కొన్నారు. ముఖ్యంగా, బనకచర్ల విషయంలో బీఆర్ఎస్ నిరంతర హెచ్చరికలు చేసినప్పటికీ, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని హరీశ్ రావు పేర్కొన్నారు. "బనకచర్ల ముప్పును ముందుగానే గుర్తించి రణభేరి మోగించినది బీఆర్ఎస్. అయితే కేంద్రం, ఢిల్లీలో సమావేశం పెట్టినప్పుడు రేవంత్ రెడ్డి 'పోను' అని వెళ్ళాడు, ఇప్పుడు అదే కమిటీ వేసి కేంద్రానికి పేర్లను సూచిస్తున్నాడు" అని తెలిపారు. ఈ కమిటీకి ఆదిత్యనాథ్ దాస్‌ను చైర్మన్‌గా నియమించడం తెలంగాణకు వెన్నుపోటు అని, "దొంగకు తాళం ఇచ్చినట్లే" వ్యవహారం అని విమర్శించారు. చంద్రబాబు సూచన ప్రకారం రేవంత్ దాస్‌ను నీటి పారుదల శాఖ సలహాదారుగా నియమించుకున్నారని, ఇది తెలంగాణ నీటి హక్కులకు భారీ అడ్డుపడటం అని తెలిపారు. పోలవరం-నల్లమల సాగర్ లింక్ ద్వారా గోదావరి నీటిని కృష్ణాలో కలపకుండా, పెన్నా బేసిన్‌కు తరలించడం ద్వారా కర్ణాటక, మహారాష్ట్రలకు దక్కాల్సిన వాటాను నిలిపివేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం అని హరీశ్ రావు అన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఈ కుట్రను గుర్తించి, కేంద్రానికి లేఖలు రాసినప్పటికీ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకోలేదని, "ఇది అంతా డ్రామా" అని అన్నారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం 16 డిసెంబరుకు కోర్టుకు వెళ్లి, 23 డిసెంబరుకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. అయితే ఏపీ ప్రభుత్వం కేసు వేస్తూ, మరోవైపు కమిటీ పెట్టి కేసు బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నదని హరీశ్ రావు ఆరోపించారు. "ఆపినట్టు ఉండాలి కానీ ప్రాజెక్టు ఆగకూడదు, కొట్టినట్టు ఉండాలి కానీ దెబ్బ తాకకూడదు" అని పేర్కొన్నారు. ప్రత్యేకంగా, బనకచర్లకు 200 టీఎంసీల నీటిని తీసుకువెళ్ళే అవకాశం కేంద్రం నుంచి తక్షణమే రావడం, తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడు అనుమతి తీసుకోలేదన్న అంశాన్ని హరీశ్ రావు వెల్లడించారు. దీన్ని కేంద్రం ముందే ఆమోదించిందని, కానీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే అడ్డుపడుతున్నదని తెలిపారు. చివరిగా, హరీశ్ రావు తెలంగాణ అసెంబ్లీలో నల్లమల సాగర్‌కి వ్యతిరేక తీర్మానం చేయాలని, ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే, కేంద్రం, సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి తెలంగాణ నీటి హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

'సంక్రాంతి' టోల్ గేట్లు నిలిపివేసే యోచన

- వాహనాల రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలు
- ఎన్‌హెచ్ఏఐకి లేఖ రాయాలని నిర్ణయం -
- కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్30: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి పండగ రోజుల్లో టోల్ గేట్ల నిర్వహణను నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు లేఖ రాయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాశారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండగ సమయంలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం ఫ్లై ఓవర్లు, వంతెనలు, అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్ల పనులు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 3, 4 రోజుల పాటు టోల్ గేట్ల నిర్వహణను ఆపాలని రాష్ట్రం ప్రభుత్వం భావిస్తోంది.

టోల్ ఫీజు మినహాయించండి

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాసిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంక్రాంతి సందర్భంగా టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్-విజయవాడ హైవేపై జనవరి 9 నుంచి 18 వరకు టోల్ ఫీజు మినహాయించాలని కోరారు. పండగ రోజుల్లో ట్రాఫిక్ 200 శాతం అధికంగా ఉంటుందన్న మంత్రి టోల్ గేట్ల వద్ద వాహనాలు ఆగకుండా సహకరించాలని లేఖ రాశారు.

రద్దీపై మంత్రి సమీక్ష

సంక్రాంతి పండుగకి సొంతూళ్లకు వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్-విజయవాడ హైవే పై జనవరి 8 నుండి వాహన రద్దీ ఎక్కువ ఉంటుందని, ఈ సమయంలో రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుందని, దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్రాంతి పండుగ సమయంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సచివాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దు

నేడు తాను తూప్రాన్ పేట్, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తానని అధికారుల చర్యలను పరిశీలిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రధానంగా ఎల్బీనగర్ నుంచి వనస్థలిపురం, పనామా గోడౌన్, హయత్ నగర్, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి ప్రాంతాల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదన్నారు. పండుగ రద్దీ ఉన్నరోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దన్నారు. అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలన్నారు. పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలన్నారు. అన్ని రహదారి లేన్‌లు వాహనాల రాకపోకలకు పూర్తిగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.

అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలి

రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం పాటించాలని, అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. రోడ్డు పనుల్లో ఉన్న సిబ్బంది అందరూ ప్రతిబింబించే జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. రాత్రి సమయంలో జంక్షన్లు, వర్క్ జోన్‌ల వద్ద తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలన్నారు. బారికేడ్లు, ట్రాఫిక్ ఐలాండ్‌లపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. రూట్ పెట్రోల్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలని, టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగకుండా సజావుగా వెళ్లేలా అదనపు బృందాలను మోహరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

"బనకచర్ల ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వం చేసిందేమీ లేదని హరీశ్ రావు అబద్ధాలు చెబుతూనే ఉన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం పోరాడుతూనే ఉంది. ఇప్పటికే దానిపై సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాం. అది జనవరి 5న విచారణకు రానుంది. కేంద్రం ఈ ప్రాజెక్టును వ్యతిరేకించడమే కాకుండా.. డీపీఆర్‌కూడా సిద్ధం చేయకుండా ఏపీని అడ్డుకుంది.

- రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్

రాష్ట్రీయం

తిరుమల తరహాలో యాదగిరిగుట్టలో పలు కొత్త సేవలు

- ప్రతి బుధవారం తోమాల సేవ
- సరికొత్తగా తులాభారం సేవ
- నేటి నుంచి ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ
- ఫిబ్రవరి నుంచి వాహన సేవలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్30: తెలంగాణలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ఆర్జిత సేవలను ప్రారంభించేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సేవలలో కొన్నిటిని వైకుంఠ ఏకాదశి నుంచి, మిగతా వాటిని ఫిబ్రవరి నెల నుంచి దశలవారీగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా ప్రవేశపెట్టనున్న సేవల్లో భాగంగా ముందుగా తోమాల సేవను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సేవ ప్రతి బుధవారం ఉదయం 6.15 నుంచి 6.45 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతులు కలిసి పాల్గొనే ఈ సేవకు టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. భక్తులు స్వామివారికి తోమాల సమర్పించి ప్రత్యేక ఆశీర్వాదాలు పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న విధానానికి భిన్నంగా తులాభారం సేవను సరికొత్తగా రూపొందించారు. ఈ సేవలో అవసరమైన నాణేలు, బెల్లం వంటి వస్తువులను ఆలయ అధికారులు స్వయంగా అందుబాటులో ఉంచనున్నారు. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తులాభారం నిర్వహించుకునే అవకాశం కలగనుంది. వైకుంఠ ఏకాదశి తర్వాత ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను ప్రారంభించనున్నారు. ఈ సేవకు టికెట్ ధర రూ.500గా నిర్ణయించగా, ఇందులో పాల్గొన్న భక్తులకు రెండు లడ్డూ ప్రసాదాలను ఉచితంగా అందజేయనున్నారు. ఇక ఇప్పటివరకు రథసప్తమి రోజుకే పరిమితమైన సూర్యప్రభ వాహన సేవను ఇకపై ప్రతి ఆదివారం ఉదయం 7.00 నుంచి 7.30 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతుల కోసం ఈ సేవ టికెట్ ధరను రూ.1,000గా నిర్ణయించారు. ఈ సేవలో పాల్గొనే భక్తులకు ఒక శాలువా, కనుమను ప్రసాదంగా అందజేస్తారు. అలాగే ఆలయ చరిత్రలో తొలిసారిగా చంద్రప్రభ వాహన సేవను కూడా ప్రారంభించనున్నారు. ఈ సేవకు కూడా టికెట్ ధర రూ.1,000గా నిర్ణయించగా, ప్రత్యేక వాహన సేవ ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు. వైకుంఠ ఏకాదశి నుంచే తోమాల సేవ, తులాభారం సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు అందుబాటులోకి తీసుకువస్తుండగా, 2026 ఫిబ్రవరి 1వ తేదీ (మాఘ శుద్ధ పౌర్ణమి) నుంచి సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. యాదగిరిగుట్టను ఆధ్యాత్మికంగా మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అధికారులు తీసుకుంటున్న ఈ నిర్ణయాలపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టీమ్ వర్క్ తో సమర్థవంతంగా పని చేస్తాం

- అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- ఫ్యూచర్‌సిటీ సీపీగా సుధీర్‌బాబు బాధ్యతలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్30 : రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు బాధ్యతలను నిర్వహిస్తామని ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. అన్నీ శాఖల సమన్వయంతో పని చేస్తామని, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో 22 పోలీసు స్టేషన్లు పని చేస్తాయని, ఈ పోలీసు స్టేషన్ల అధికారులతో కలిసి టీమ్ వర్క్ తో సమర్థవంతంగా పని చేస్తామని అన్నారు. నాకు ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా మంగళవారం సాయంత్రం సుధీర్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నేను ఈ రోజు ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, రాష్ట్ర అభివృద్ధిని ప్రపంచ దేశాలకు తెలిసేలా ఇటీవల గ్లోబల్ సమ్మిట్ నిర్వహించుకోవడం జరిగినదని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కొత్తగా నాలుగు పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో భాగంగా ఈ రోజు ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని అన్నారు.

వరల్డ్ టాప్ 10 నగరాల జాబితాలో హైదరాబాద్

- 2024 సావిల్స్ గ్రోత్ హబ్స్ ఇండెక్స్ లో ఆసియా అగ్రస్థానం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్30: సావిల్స్ గ్రోత్ హబ్స్ ఇండెక్స్ 2024 ప్రకారం, హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా, ప్రపంచవ్యాప్తంగా నాల్గవ స్థానాన్ని దక్కించుకుంది. ఈ ర్యాంకింగ్స్‌లో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, వియత్నాంలోని హో చి మిన్ సిటీ, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నడిపించడంలో ఆసియా ఆధిపత్యాన్ని సూచిస్తుంది. సావిల్స్ వరల్డ్ రీసెర్చ్ నిర్వహించిన ఈ పరిశోధన, ఆర్థిక వ్యవస్థ, జనాభా, వ్యక్తిగత సంపద వంటి కీలక సూచికల ఆధారంగా 2033 నాటికి అత్యంత బలమైన వృద్ధికి సిద్ధంగా ఉన్న నగరాలను విశ్లేషిస్తుంది. సావిల్స్ రెసిలియంట్ సిటీస్ ఇండెక్స్‌కు అనుబంధంగా ఉండే ఈ సూచిక, రాబోయే దశాబ్దంలో ఏ నగరాలు తమ పోటీదారులను అధిగమిస్తాయో అంచనా వేయడానికి ప్రపంచవ్యాప్తంగా 230 నగరాలను అధ్యయనం చేస్తుంది. నివేదిక ప్రకారం, ప్రపంచంలోని అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న టాప్ 15 నగరాల్లో 14 ఆసియాలోనే ఉన్నాయి. ఇందులో భారత్ నుంచి ఏకంగా నాలుగు నగరాలు చోటు దక్కించుకోవడం విశేషం. ప్రస్తుతం, ప్రపంచ జనాభాలో 55 శాతం మంది నగరాల్లో నివసిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం.. 2050 నాటికి ఈ సంఖ్య దాదాపు పది మందిలో ఏడుగురికి పెరుగుతుంది. అంటే, అదనంగా సుమారు 2.5 బిలియన్ల మంది ప్రజలు నగరాలకు తరలి వస్తారని నివేదిక అంచనా వేసింది. కాగా 4 వ స్థానంలో హైదరాబాద్ నిలిచింది. భారత్ లో హైదరాబాద్ నూతన ఆవిష్కరణల కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఐటీ, ఫార్మస్యూటికల్, ఆటోమోటివ్ పరిశ్రమలకు నిలయంగా నిలుస్తూ, అమెజాన్, గూగుల్, డెల్, టాటా, మైక్రోసాఫ్ట్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలకు ఆతిథ్యం ఇస్తోంది.

తెలంగాణను గ్లోబల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుదాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్30 : తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశానికే దిక్సూచిగా తీర్చిదిద్దాలని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో వినూత్న మార్పులు అవసరమని పేర్కొన్నారు. మంగళవారం తారామతి బరాదరిలో 'టూరిజం అండ్ ఇట్స్ విజన్ 2026' మేధోమథన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీటీడీసీ రూపొందించిన టేబుల్ క్యాలెండర్-2026ను ఆవిష్కరించారు. అనంతరం టూరిజం అండ్ ఇట్స్ విజన్ - 2026 వర్క్‌షాప్‌లో అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు.

కన్నుల పండువగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

- ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న పలువురు ప్రముఖులు

ప్రతిపక్షం, మొయినాబాద్ , డిసెంబర్ 30 : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని కనకమామిడి, చిల్కూర్ బాలాజీ దేవాలయాల్లో మంగళవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలకు పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల్లో పలువురు ప్రముఖులు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రజలంతా స్వామి వారి కృపతో చల్లగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 30 : ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. మండలంలోని బాకారం గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. ఈ శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్ లు , వార్డు సభ్యులు, పశు వైద్య సిబ్బంది, పశు పెంపకదారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల నియామకం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్ డిసెంబర్ 30: బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాసనసభలో, శాసనమండలిలో పార్టీకి కీలకమైన నేతలను నియమించారు. శాసనసభలో తన్నీరు హరీశ్ రావు, పటోల్ల సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా నియమించారు. అలాగే, శాసనమండలిలో ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలను డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా నియమించారు. మండలిలో పార్టీ విప్ బాధ్యతలను దేశపతి శ్రీనివాస్ వహించనున్నారు. బీఆర్ఎస్ పార్టీ శాసనపక్షంలో నాయకత్వ వ్యవస్థను మరింత కేంద్రీకృతం చేసి, సభల్లో సమన్వయాన్ని పెంపొందించేందుకు నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ముదిరాజ్ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

ప్రతిపక్షం, కుత్బుల్లాపూర్, డిసెంబర్ 30 : హైదరాబాద్ లోని రవీంద్రభారతిలో ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సర్పంచ్ లకు ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్, ముదిరాజ్ సమన్వయ కమిటీ సంయుక్తంగా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర క్రీడలు మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరై, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికైన దాదాపు 680 మంది సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లను సన్మానించారు. ముదిరాజ్ కులానికి సంబంధించిన ముఖ్య నేతలంతా ఒకే వేదిక మీదికి రావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముదిరాజులు ఆర్థికంగా సామాజికంగా ఎదగడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఉమ్మడి కార్యాచరణ ఉండాలని ముక్తకంఠంతో నేతలు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ముదిరాజ్ కులాన్ని బిసిడి నుంచి ఏ లోకి మార్చే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొత్త సర్పంచులు రాబోవు ఎంపీటీసీ జడ్పిటిసి, కౌన్సిలర్, కార్పొరేటర్ ఎన్నికల్లో ముదిరాజ్ నాయకులను గెలిపించడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముదిరాజ్, శాసన మండలి ఉపసభాపతి బండా ప్రకాష్ ముదిరాజ్, అఖిల భారత కోలి సమాజ్ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 252లో కొన్ని సవరణలు చేయండి

- మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే అభ్యర్థన

ప్రతిపక్షం బ్యూరో, ఉత్తర తెలంగాణ, కరీంనగర్, డిసెంబర్ 30: జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో కొన్ని సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. మంగళవారం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార మరియు పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జీవో పై చర్చించడంతో పాటు వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన తమ సంఘం ముఖ్యుల సమావేశం, 252 జీవో ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జర్నలిస్టుల నుండి వ్యక్తం అవుతున్న అభ్యంతరాలు, జీవోలో లోటుపాట్లపై చర్చించి, కొన్ని సవరణలు అవసరమనే అభిప్రాయానికి వచ్చినట్లు మంత్రితో తెలిపారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులతో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా కొందరికి మాత్రమే న్యాయం జరిగేదని, ప్రస్తుతం అలా కాకుండా బస్ పాస్ లతో సహా ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులనే తేడా లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి డెస్క్ జర్నలిస్టుకు వర్తింపజేసేలా జీవో లో సవరించాలని ఆయన కోరారు. కేబుల్ టీవీ ఛానెల్స్ కు సంబంధించి, జీవో లో పేర్కొన్న అస్పష్టతను సరిచేయాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మండలానికి ఒకటి కాకుండా, సదరు మండలంలో ప్రధాన డేట్ లైన్ లను గుర్తించి, వాటి ప్రకారం అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేందుకు జీవో ను సవరించాలని కోరారు. చిన్న పత్రికలకు సర్క్యులేషన్ ఆధారంగా జిల్లాల్లో కూడా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. ప్రధాన పత్రికలు, శాటిలైట్ న్యూస్ ఛానెల్స్ కు కార్డుల కుదింపు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, వీడియో జర్నలిస్టులకు, కెమెరా జర్నలిస్టులకు వారి కార్యాలయాల సిఫారసుల మేరకు అందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషా కనక, ఇతర భాషల సర్క్యులేషన్ లతో, గ్రేడింగ్ లతో వాటిని పోల్చకుండా, ఉర్దూ పత్రికలు సర్క్యులేట్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక కేటగిరి క్రింద జిల్లా, మండల స్థాయిల్లో ఉర్దూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా జీవో లో పొందుపర్చాలని కోరారు. వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు పొందడానికి, జీవో లో పేర్కొన్న వృత్తి అనుభవాన్ని కొంత తగ్గిస్తూ సవరించాలని మంత్రిని ఆయన కోరారు. టీయూడబ్ల్యూజే అభ్యర్థనపై మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, త్వరలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి, ఏమైనా లోటుపాట్లుంటే సరిచేసుకుందామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి, రాష్ట్ర కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, ఎండీ గౌస్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ తదితరులు ఉన్నారు.

టీయూడబ్ల్యూజే సూచనలను పరిశీలిస్తాం

జీవో 252పై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం లిఖిత పూర్వకంగా చేసిన సూచనలను పరిశీలిస్తామని, మంగళవారం సచివాలయంలో తనను కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సమావేశాన్ని నిర్వహించి జర్నలిస్టు సంఘాల అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు.

మౌళిక అంశాలపై పట్టు.. ఉద్యోగానికి తొలి మెట్టు

- ఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన గూగుల్ ఇంజనీర్ రోహిత్ కీర్తాంకర్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 30 : సాంకేతిక ఇంటర్వ్యూలలో విజయం సాధించడానికి డేటా నిర్మాణాల పనితీరుపై అవగాహనతో పాటు మౌళిక అంశాలపై పట్టు తప్పనిసరని గూగుల్ ఏడీఎస్ సొల్యూషన్స్ ఇంజనీర్ కీర్తాంకర్ స్పష్టీకరించారు. హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 'గూగుల్ స్పీకర్ సెషన్: జాబితా, మ్యాప్, O(1) మ్యాజిక్' అనే అంశంపై మంగళవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. గీతంలోని గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆన్ క్యాంపస్ (జీడీజీసీ) నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోహిత్ పనితీరు ఆధారిత ఇంజనీరింగ్, డేటా నిర్మాణాలపై లోతైన అవగాహన కల్పించారు. సమయం, స్థల సంక్లిష్టత, సేకరణల ప్రాముఖ్యత, సరైన పనితీరును సాధించడానికి జాబితాలు, మ్యాపులు, సెట్ల ప్రభావవంతమైన ఉపయోగంపై రోహిత్ ప్రధానంగా దృష్టి సారించారు. బిగ్‌ఓ సంజ్ఞామనం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, స్కేలబుల్ అప్లికేషన్లను నిర్మించడానికి మౌళిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. ఆచరణాత్మక ఇంటర్వ్యూ వ్యూహాలను పంచుకున్నారు. విద్యార్థులు ప్రాథమిక పరిష్కారాలతో ప్రారంభించి, క్రమంగా వాటిని మెరుగుపరచాలని, తమ ఆలోచనా ప్రక్రియను స్పష్టంగా తెలియజేయాలని ప్రోత్సహించారు. ఇంటర్వ్యూ కోసం సన్నద్ధత, ఫ్లాట్ ఫామ్ ఆధారిత అభ్యాసం, వైఫల్యాల నుంచి నేర్చుకోవడంపై విద్యార్థులకు రోహిత్ మార్గదర్శనం చేశారు. జీడీజీసీ అధ్యక్షురాలు ఆశ్వికా ఖురానా, అతిథిని పరిచయం చేసి, ఇతర బృంద సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ప్రజలను కేంద్ర ప్రభుత్వం వేధిస్తోంది. ఏఐతో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియ పెద్ద మోసం. భారీగా ఓటర్ల పేర్లు తొలగించే యత్నం జరుగుతోంది. అర్హుడైన ఒక్క ఓటర్ పేరు తొలగించినా ఢిల్లీలోని ఎన్నికల కమిషన్‌కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

ఓపెన్ వాయిస్

ఇళ్ల కూల్చివేత.. మిత్రుల మధ్య విభేదాలు

బెంగళూరు శివారు ప్రాంతం యలహంకలో ఇటీవల జరిగిన ఇళ్ల కూల్చివేత ఘటన కర్ణాటక, కేరళ రాష్ట్రాల మధ్య రాజకీయ చిచ్చును రేపింది. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేరళ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్ చేసిన ఘాటు వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయ్యాయి. ఇండియా కూటమిలో మిత్రపక్షాలుగా ఉన్నప్పటికీ, ఈ రెండు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. అసలు యలహంకలో ఏం జరిగింది? కేరళ సీఎం ఈ అంశాన్ని ఎందుకు హైలైట్ చేస్తున్నారు? ఇది కేవలం మానవతా దృక్పథంతో చేసిన వ్యాఖ్యలేనా లేక రాబోయే కేరళ ఎన్నికల కోసం వేస్తున్న రాజకీయ ఎత్తుగడా? అన్న కోణంలో అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. బెంగళూరు నగర శివారులోని యలహంక పరిధిలో ఉన్న ఓ కాలనీలో దాదాపు 300నుంచి 400 ఇళ్లను కర్నాటక అధికారులు ఈ నెల 20న నేలమట్టం చేశారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో అత్యధికులు నిరుపేద ముస్లింలు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే, బుల్డోజర్లతో తమ ఇళ్లను కూల్చేశారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే, ఆక్రమణల తొలగింపు పేరుతోనే ఈ చర్యలు తీసుకున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, ఒకేసారి వందల ఇళ్లను కూల్చివేయడం, బాధితులకు ప్రత్యామ్నాయం చూపించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బుల్డోజర్ న్యాయం పేరుతో జరిగిన కూల్చివేతలను కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. కానీ, ఇప్పుడు సొంత పాలనలో ఉన్న కర్నాటకలో అదే తరహా ఘటన జరగడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. ఈ ఘటనపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వెంటనే స్పందించారు. కర్నాటక ప్రభుత్వం తీరును తప్పుబడుతూ, కాంగ్రెస్ పార్టీ కూడా సంఘ్ పరివార్ బాటలోనే నడుస్తోందని తీవ్ర విమర్శలు చేశారు. "ముస్లింల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం బీజేపీ విధానం అయితే, కాంగ్రెస్ కూడా అదే సంస్కృతిని అనుసరిస్తోంది" అని ఆయన ఆరోపించారు. లౌకికవాదం గురించి మాట్లాడే కాంగ్రెస్, చేతల్లో మాత్రం హిందుత్వ ఎజెండాను అమలు చేస్తోందనేది పినరయి ప్రధాన ఆరోపణ. దీనికి కర్ణాటక ప్రభుత్వం కూడా అంతే దీటుగా బదులిచ్చింది. కేరళ సీఎం తమ రాష్ట్ర వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని, బాధితులకు తాము అండగా ఉంటామని, ఇళ్లు కట్టిస్తామని కర్నాటక మంత్రులు కౌంటర్ ఇచ్చారు.

ప్రతిపక్షం
హైదరాబాద్,
బుధవారం
31.12.2025

పినరయి విజయన్ వ్యాఖ్యలను కేవలం పొరుగు రాష్ట్రంలో జరిగిన అన్యాయంపై స్పందనగా మాత్రమే చూడలేమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు, రాబోయే కేరళ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలు దాగి ఉన్నాయని చెప్తున్నారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో కాంగ్రెస్, సీపీఎం కలిసే ఉన్నా, కేరళలో మాత్రం ఈ రెండు పార్టీలే ప్రధాన ప్రత్యర్థులు. అక్కడ బీజేపీ ప్రభావం తక్కువ కాబట్టి, అధికారం ఎప్పుడూ ఎల్డీఎఫ్ (లెఫ్ట్) లేదా యూడీఎఫ్ (కాంగ్రెస్) చేతుల్లోనే మారుతుంటుంది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ ను దెబ్బకొట్టాలంటే, ఆ పార్టీని సాఫ్ట్ హిందుత్వ పార్టీగా ముద్ర వేయడం కమ్యూనిస్టులకు అవసరం. కేరళ రాజకీయాల్లో ముస్లిం ఓటు బ్యాంక్ చాలా కీలకం. సంప్రదాయబద్ధంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ద్వారా ముస్లిం ఓట్లు కాంగ్రెస్ కూటమి వైపు ఉంటాయి. ఆ ఓటు బ్యాంకును చీల్చడమే పినరయి లక్ష్యం. కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల ఇళ్లు కూల్చేస్తోందని చెప్పడం ద్వారా, కేరళలోని ముస్లింలకు కాంగ్రెస్ ను నమ్మవద్దనే సంకేతాన్ని పంపాలని ఎల్డీఎఫ్ భావిస్తోంది. దేశవ్యాప్తంగా బీజేపీకి కాంగ్రెస్ సరైన ప్రత్యామ్నాయం కాదని, ఆ పార్టీ కూడా బీజేపీ సిద్ధాంతాలనే పరోక్షంగా అమలు చేస్తోందని చెప్పడం ద్వారా, కమ్యూనిస్టులు తమ భావజాలాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. యలహంక ఘటన వారికి ఒక అద్భుతమైన రాజకీయ ఆయుధంగా దొరికింది.ఈ పరిణామం జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలోని డొల్లతనాన్ని కూడా బయటపెడుతోంది. ఢిల్లీలో చేతులు కలిపే నేతలు, రాష్ట్రాల స్థాయిలో మాత్రం ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. వాయనాడ్ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీకి సీపీఎం మద్దతు ఇవ్వకపోవడం, ఇప్పుడు పినరయి విమర్శలు.. ఇవన్నీ భవిష్యత్తులో కూటమి ఐక్యతపై సందేహాలను లేవనెత్తుతున్నాయి.మొత్తానికి, బెంగళూరులో జరిగిన ఒక స్థానిక పాలనాపరమైన తప్పిదం, పక్క రాష్ట్రమైన కేరళలో అతిపెద్ద రాజకీయ అస్త్రంగా మారింది. కర్నాటక ప్రభుత్వం బాధితులకు న్యాయం చేసి, ఇళ్లు కట్టిస్తామని నష్ట నివారణ చర్యలు చేపట్టినప్పటికీ, పినరయి విజయన్ లేవనెత్తిన కాంగ్రెస్, సంఘ్ పరివార్ ఒక్కటే అనే నినాదం కేరళ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఇరకాటంలో పెట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బుల్డోజర్ రాజకీయాలు కేవలం ఇళ్లను కూల్చడమే కాదు, రెండు మిత్రపక్షాల మధ్య సంబంధాలను కూడా కూల్చేస్తున్నాయి .

వందేళ్ల పోరాటం.. రేపటి ఆశయం

భారత రాజకీయ ముఖచిత్రంపై ఒక శతాబ్దం పాటు చెరగని ముద్ర వేసిన వామపక్ష ఉద్యమం, తన వందో పుట్టినరోజున అత్యంత క్లిష్టమైన మనుగడ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ), దేశ స్వాతంత్ర్య పోరాటం నుండి సామాజిక విప్లవాల వరకు అనేక కీలక ఘట్టాలలో భాగస్వామి అయింది. నాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కార్మికులను, కర్షకులను ఏకం చేసిన ఈ సిద్ధాంతం, స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజాస్వామ్య బలోపేతానికి వెన్నెముకగా నిలిచింది.

వెంకగారి భూమయ్య
9848559863

ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో దేశ రాజకీయం పూర్తిగా కేంద్రీకృతమై, జాతీయవాద భావజాలం ఒక ప్రభంజనంలా బలపడిన వేళ, కమ్యూనిస్టుల ఉనికి తీవ్రమైన ప్రశ్నార్థకంగా మారింది. వందేళ్ల ప్రస్థానంలో ఎన్నో చారిత్రక విజయాలను, ఎత్తుపల్లాలను చూసిన ఈ సిద్ధాంతం, నేడు ఎన్నికల రాజకీయాల్లో ఓటమి అంచున నిలబడి తన మౌలిక పునాదులను వెతుక్కుంటోంది. ఇది కేవలం ఒక రాజకీయ పక్షం ఎదుర్కొంటున్న సంక్షోభం మాత్రమే కాదు, ఒక శతాబ్దపు భావజాల సంఘర్షణలో చోటు చేసుకుంటున్న పెను మార్పుగా దీనిని విశ్లేషించవచ్చు. ఆర్థిక సంస్కరణలు, కార్పొరేట్ శక్తుల ఆధిపత్యం పెరిగిన నేటి తరుణంలో, సామాన్యుడి గొంతుకగా నిలిచిన వామపక్షాలు తమ పంథాను మార్చుకోవాల్సిన అవసరాన్ని ఈ శతాబ్ది వేడుకలు గుర్తుచేస్తున్నాయి. ఒకవైపు డిజిటల్ విప్లవం, మరోవైపు మతపరమైన ధ్రువీకరణ రాజకీయాల మధ్య కమ్యూనిజం తన ఉనికిని చాటుకోవడానికి నిరంతర పోరాటం చేస్తోంది. గడిచిన వందేళ్లలో ఈ పార్టీ సాధించిన సామాజిక మార్పును విస్మరించలేము కానీ, మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించడంలో పడుతున్న ఇబ్బందులు నేడు చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పట్టు కోల్పోవడం, యువతను ఆకర్షించలేకపోవడం వంటి సవాళ్లు ఈ వందేళ్ల ప్రస్థానంలో ఒక చీకటి కోణంగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ, రాజ్యాంగ విలువల పరిరక్షణలో మరియు ప్రశ్నించే గొంతుకగా వామపక్షాల ఆవశ్యకతను మేధావి వర్గం నేటికీ నొక్కి చెబుతోంది. ఈ పరిణామాలన్నీ భారత రాజకీయాల్లో ఒక నూతన శకానికి నాంది పలుకుతాయా లేదా అన్నది ప్రస్తుతం దేశవ్యాప్తంగా సాగుతున్న మేధోమథనం.

ప్రజాస్వామ్య రక్షణలో వామపక్షాల పాత్ర

సానుకూల దృక్పథంతో విశ్లేషిస్తే, భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో కమ్యూనిస్టుల పాత్ర వెలకట్టలేనిది. వారు అధికారంలో ఉన్నా లేకపోయినా, పార్లమెంటులో సామాన్యుల పక్షాన నిలబడే ఒక బలమైన 'నిఘా శక్తి'గా పనిచేశారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో వారు అమలు చేసిన భూ సంస్కరణలు భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చేశాయి. నిరుపేదలకు భూమిపై హక్కు కల్పించడం ద్వారా సామాజిక గౌరవాన్ని అందించారు. కేరళలో విద్యా, వైద్య రంగాలలో వారు సాధించిన అద్భుతమైన ప్రగతి నేటికీ అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమవుతోంది. అంతేకాకుండా, యూపీఏ 1 ప్రభుత్వ హయాంలో సమాచార హక్కు చట్టం మరియు ఉపాధి హక్కు వంటి ప్రజానుకూల చట్టాల వెనుక వామపక్షాల మేధోమథనం మరియు పోరాటం ఉంది.

మారుతున్న కాలం – మారని సిద్ధాంతాలు

అయితే, ప్రతికూల అంశాలను పరిశీలిస్తే, మారుతున్న కాలానికి అనుగుణంగా వామపక్షాలు తమను తాము ఆధునీకరించుకోవడంలో వైఫల్యం చెందాయి. ఒకప్పుడు



కార్మికులు అంటే కేవలం ఫ్యాక్టరీ కూలీలే అనుకునే కాలం పోయింది. నేడు 'గిగ్ ఎకానమీ' మరియు 'ఐటీ సర్వీస్' రంగాలలో పనిచేసే నయా శ్రామిక వర్గం పుట్టుకొచ్చింది. కానీ, కమ్యూనిస్టులు ఇంకా పాతకాలపు పద్ధతులు మరియు అవుట్‌డేటెడ్ నినాదాలకే పరిమితమవ్వడం వారిని యువతకు దూరం చేసింది. ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న బలమైన జాతీయవాద ప్రవాహం ముందు వామపక్షాల 'అంతర్జాతీయవాదం' నిలవలేకపోతోంది. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఇతర పార్టీలు టెక్నాలజీని వాడుకుంటూ కొత్త పుంతలు తొక్కుతుంటే, కమ్యూనిస్టులు క్షేత్రస్థాయిలో తమ పట్టును కోల్పోతున్నారు. చారిత్రక తప్పిదాలు మరియు నాయకత్వ లేమి వెరసి వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీని కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం చేశాయి.

నవ భారత రాజకీయాల్లో భవిష్యత్తు రేఖలు

రాబోయే కాలంలో భారత రాజకీయాలు కేవలం ఎన్నికల యుద్ధతంత్ర్యాలుగా మాత్రమే కాకుండా, సామాజిక విలువల సంఘర్షణగా మారే అవకాశం ఉంది. ఒకవైపు సంప్రదాయ పద్ధతులను గౌరవిస్తూనే, మరోవైపు ఆధునిక ఆర్థిక ప్రగతిని కాంక్షించే భారతీయుడు, తన రాజకీయ ఎంపికల్లో దేనికి ప్రాధాన్యత ఇవ్వాలో తేల్చుకోలేని సందిగ్ధంలో ఉన్నాడు. గ్లోబల్ మార్కెట్ లో భారత్ ఒక ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న తరుణంలో, ఆ సంపద అందరికీ సమానంగా అందుతోందా లేదా అనే ఆవేదన ప్రజల్లో అంతర్లీనంగా ఉంది. ఈ అసంతృప్తి ఏ క్షణమైనా కొత్త రాజకీయ చైతన్యానికి దారితీయవచ్చు. సిద్ధాంతాలు అనేవి పుస్తకాల్లో కాకుండా, ప్రజల పళ్లెంలో ఉండే అన్నం ముక్కలో కనిపించినప్పుడే ఏ రాజకీయ శక్తికైనా మనుగడ ఉంటుంది.

అనివార్యమైన పోరాటం

అసలు గందరగోళం ఇక్కడే ఉంది. ఒకవైపు ఎన్డీఏ హవా ప్రభంజనంలా కనిపిస్తున్నా, సామాన్యుడి కడుపు మంట చల్లారని సత్యం మరోవైపు నివురు గప్పిన నిప్పులా ఉంది. ప్రస్తుతం దేశం అభివృద్ధి చెందుతోందని అధికార పక్షం గణాంకాలు చూపిస్తున్నా, ఆ సంపద కేవలం కొద్దిమంది కార్పొరేట్ శక్తుల దగ్గరే కేంద్రీకృతమవుతుండటం గమనార్హం. ఇలాంటి తరుణంలో, నిరుపేదల ఆకలి కేకలకు ప్రతిధ్వనిగా నిలిచే కమ్యూనిస్టుల అవసరం దేశానికి మరెంతో ఉంది. ప్రచార ఆర్భాటాల కింద అణచివేయబడిన సామాన్యుడి గొంతుక మళ్లీ వినబడాలంటే ఎర్రజెండా రెపరెపలాడక తప్పదు. అభివృద్ధి పేరుతో సాగుతున్న దోపిడీని అడ్డుకోవాలన్నా, రాజ్యాంగ విలువల రక్షణలో రాజీలేని పోరాటం చేయాలన్నా కమ్యూనిస్టుల సిద్ధాంతమే శ్రీరామరక్ష. ఎన్నికల ఫలితాలు ఏవైనా, ప్రజల పక్షాన నిలబడి అన్యాయాన్ని ప్రశ్నించే ఆ తెగువ కేవలం వామపక్షాలకే సాధ్యం. అందుకే, నేటి రాజకీయ అయోమయంలో సామాన్య ఓటరు ఏ దారి వెతుక్కున్నా, చివరికి ఆకలి తీర్చే పోరాటంలో అతనికి తోడుగా నిలిచేది మాత్రం మళ్లీ ఆ ఎర్రజెండానే అన్నది అక్షర సత్యం. ఈ శతాబ్ది వేడుకలు కేవలం గతాన్ని స్మరించుకోవడానికి కాదు, అసమానతలు లేని సమాజ స్థాపన కోసం కమ్యూనిస్టులు మరోసారి సమరశంఖం పూరించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

అక్షరాల నుంచి ఆత్మవిశ్వాసం వరకూ..
నా కలం నడిపిన బాట

చిటికెన కిరణ్ కుమార్
9490841284

ఒక్కోసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆనందం మళ్లీ మళ్లీ మన వెంట నడుస్తున్నట్టు అనిపిస్తుంది. చిన్ననాటి చదువు రోజుల జ్ఞాపకాలు, తొలి ప్రయత్నాల తడబాటు, మొదటి విజయం ఇచ్చిన ధైర్యం..అన్నీ కలిసి ఒక జీవన ప్రయాణంగా మదిలో నిలుస్తాయి. అలా చూసుకుంటే, 1994లోనే నా కలానికి నేను స్నేహం చేశానని ఇప్పుడు అనిపిస్తుంది. అప్పట్లో పత్రికలో ఒక చిన్న శీర్షిక కింద నా రచన మొదటిసారిగా అచ్చు అయిన క్షణమే, నాకు తెలియకుండానే నా జీవితానికి ఒక కొత్త మలుపు మొదలైంది. ఆ పత్రికా ముఖం ద్వారానే నేను పాఠకులతో పరిచయం అయ్యాను. ఉత్తర ప్రత్యుత్తరాలు మొదలయ్యాయి. మాటల ద్వారా కాకుండా అక్షరాల ద్వారా ఏర్పడిన ఆ పరిచయాలు, క్రమంగా ఒక వంతెనగా మారాయి. విజయవాడ వాసి అయిన ఒక పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగరీత్యా సిరిసిల్ల అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలకు నియమితులై వచ్చిన సందర్భం ఇప్పటికీ నా మదిలో చెరిగిపోని జ్ఞాపకం. సిరిసిల్ల పాత బస్టాండ్ దగ్గర నాలుగో సందులో ఉన్న మా ఇంటికి నేరుగా వచ్చి "కిరణ్ కుమార్ ఉన్నారా?" అని అడిగిన ఆ క్షణం, అక్షరాల పరిచయం మనిషిగా మారిన మొదటి అనుభూతి. ఆ తర్వాత పుట్టిన ముచ్చట్లు, ఆలోచనలు, చర్చలు నా రచనా ప్రయాణానికి లోపలి బలాన్ని ఇచ్చాయి. డిగ్రీ చదువుతున్న రోజుల్లో "భారతీయ వస్త్ర పరిశ్రమ - సిరిసిల్ల వస్త్ర సంస్థకు ప్రత్యేక సందర్భం" అనే అంశంపై ముప్పై రోజుల్లోనే ఒక ప్రాజెక్టు రిపోర్టు సిద్ధం చేయడం నాకు ప్రత్యేక అనుభవం. తోటి విద్యార్థులందరికంటే ముందుగా పని పూర్తి చేసి అధ్యాపకుల ప్రశంసలు అందుకోవడం నా లోపలి ధైర్యాన్ని పెంచింది. నా కలానికి పడిన మొదటి విజయ ముద్ర అదే అని నేను నమ్ముతాను. కాలక్రమంలో కథ, కవిత, వ్యాసం, విమర్శ..ఈ నాలుగు విభాగాల్లోనూ నా రచనలు రూపుదిద్దుకున్నాయి.

ఇంతవరకు నా రచనలు వందకు పైగా పత్రికల్లో అనేకంగా అచ్చు అయ్యాయి. ప్రతి ప్రచురణ ఒక కొత్త బాధ్యతను గుర్తుచేసింది. 2019లో విశాలాక్షి మాసపత్రికలో ప్రచురితమైన "అనుబంధం" కథ నా సాహిత్య ప్రయాణంలో ఒక కీలక అడుగు. అదే కథ ఆధారంగా రూపొందిన "ఓ తండ్రి తీర్పు" అనే కథకు, ఐదు నంది అవార్డులు అందుకున్న ప్రముఖ దర్శకుడు గాధంశెట్టి ఉమామహేశ్వరరావు దర్శకత్వం వహించి లఘు చిత్రంగా రూపొందించారు. ఆ చిత్రం అంతర్జాతీయ చలనచిత్రోత్సవాల్లో గుర్తింపు పొందింది. అక్షరాల నుంచి తెరవరకూ సాగిన ఈ ప్రయాణం నా కలానికి ఒక బలమైన ధృవీకారంగా నిలిచింది. సాహిత్యం నన్ను దేశ సరిహద్దులు దాటించి ప్రపంచ వేదికల వరకు తీసుకెళ్లింది. దక్షిణ కొరియా సియోల్, జపాన్‌లోని క్యూషన్ విశ్వవిద్యాలయం పరిసరాల్లో జరిగిన ప్రపంచ శాంతి శిఖరాగ్ర సదస్సుల్లో భారతదేశం తరపున పాల్గొనడం, అంతర్జాతీయ ప్రశంసాపత్రాలు అందుకోవడం ఒక గ్రామీణ బాటలో మొదలైన నా కల ఒకనాడు ప్రపంచస్థాయికి చేరుతుందన్న నమ్మకాన్ని మరింత బలపరిచాయి. శ్రీలంక ప్రతినిధులచే గ్లోబల్ హ్యూమన్ ఎక్సలెన్స్ అవార్డు, కెన్యా ప్రతినిధులచే సత్కారం, అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డు..వి నా రచనకు వచ్చిన గౌరవాలుగా నేను భావిస్తాను. దేశంలోనూ పలు సాహిత్య పురస్కారాలు నా ప్రయాణానికి తోడయ్యాయి. రవీంద్రనాథ్ ఠాగూర్ ఎక్సలెన్స్ అవార్డు, వివిధ సాహితీ సంస్థల పురస్కారాలు.. ఇవి నన్ను మరింతగా రాయమని ప్రోత్సహించాయి. 2025 సంవత్సరంలో అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం వారు ప్రదానం చేసిన "డాక్టర్ వద్దేపల్లి కృష్ణ జాతీయ సాహిత్య తొలి పురస్కారం" నా జీవితంలో ఒక తీపి జ్ఞాపకంగా మిగిలింది. అది ఎప్పటికీ మర్చిపోలేని గుర్తు. నా మొత్తం సాహిత్య సాధనకు వచ్చిన గుర్తింపుగా ఆ పురస్కారాన్ని నేను హృదయపూర్వకంగా స్వీకరించాను. నేటి కాలంలో పుస్తకాలు ఎక్కువగా వెలువడుతున్నాయి. చాలామంది తమ పుస్తకాలను స్వయంగా ముద్రించుకుంటున్నారు. కానీ ఒక రచన పత్రికలో అచ్చు కావడం మాత్రం ప్రత్యేకం. సంపాదకుల పరిశీలన, పాఠకుల ఆమోదం..ఈ రెండు కలిసినప్పుడే అది స్థానం పొందుతుంది. అదే రచయితకు నిజమైన ధృవీకారం.

నా మొదటి పుస్తకం "చైతన్య స్ఫూర్తి - చిటికెన వ్యాసాలు" నా సాహిత్య ప్రయాణానికి పునాది. సామాజిక, సాహిత్య అంశాలపై బాధ్యతతో రాసిన వ్యాసాల సమాహారం అది. "ఎగురుతోంది ఎగురుతోంది మువ్వన్నెల జెండా" అనే నా దేశభక్తి గేయాన్ని పాఠశాలల్లో పిల్లలు పాడుతున్నారని తెలిసినప్పుడు, నా కలం నిజంగా ప్రజల గుండెల్లోకి చేరిందన్న ఆనందం కలిగింది. సేవ అంటే పెద్ద ఖర్చులు కాదని నేను నమ్ముతాను. ఒక గ్లాసు నీళ్లు, ఒక గరిటె అన్నం.. మనసుతో ఇచ్చిన చిన్న సహాయమే గొప్ప సేవ. అదే భావన నా రచనలకు కూడా మూలం. స్వచ్ఛమైన సేవే మానవత్వానికి పునాది. కవి, రచయిత సమాజంలో వెలితిని పూరించేవాడు. అతని కలం ఆలోచనను రేపుతుంది, మనిషిని నిలదీస్తుంది. బాధ నుంచి శాంతి వరకు, మానవత్వం నుంచి మార్పు వరకు.. తన దృష్టిలో ఉన్న నిజాన్ని అక్షరాల ద్వారా వెలుగులోకి తెస్తాడు. 2025 సంవత్సరం ముగింపున నిల్చుని నా సాహిత్య ప్రయాణాన్ని వెనక్కి చూసుకుంటే, గర్వం కంటే కృతజ్ఞతే ఎక్కువగా అనిపిస్తుంది. కలం నన్ను మలిచింది, నేను కలాన్ని మలిచాను. ఈ ప్రయాణం ఇంకా కొనసాగాలి. నా రేపటి రచనలు ఇంకా లోతుగా, ఇంకా ప్రజల జీవితాలకు చేరువగా ఉండాలని కోరుకుంటున్నాను.

నా తొలి అడుగు "చైతన్య స్ఫూర్తి."
అదే నా కొత్త జన్మ.
అదే నా కొనసాగుతున్న మార్గం.

(వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త, విమర్శకులు)

'పది' పరీక్ష విధానం, షెడ్యూల్లో మార్పులు అవసరం

జుర్రు నారాయణ యాదవ్
9494019270

ఈ మధ్యకాలంలో పదవ తరగతి పరీక్ష విధానంలో జరుగుతున్న మార్పులు విద్యార్థులు, ఉపాధ్యాయులులే కాక విద్యావేత్తలలో కూడా ఆందోళన కలిగిస్తుంది.కరోనా కాలంలో పాఠశాల పని దినాలు తక్కువగా ఉండటం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడం కోసం తాత్కాలికంగా పాఠ్యాంశాలు తగ్గిస్తూ 11 పేపర్లుగా ఉన్న పదవ తరగతి పరీక్షను ఆరు పేపర్లకి తగ్గించారు. ఈ మార్పు కరోనాకాలంలో సరైనదిగానే భావించిన తర్వాత కాలంలో పాఠ్యాంశాలు కుదింపు చేయకుండా 6 పేపర్ల విధానాన్ని కొనసాగించడం వల్ల విద్యార్థుల పై మానసిక ఒత్తిడి పెరిగింది. ప్రస్తుతం 7 పరీక్షలను 35 రోజుల సుదీర్ఘ కాలం పాటు నిర్వహించాలని షెడ్యూల్ విడుదల చేయడంతో విదార్థుల్లో, ఉపాధ్యాయుల్లో మానసిక ఆందోళన మొదలైంది. పరీక్ష విధానంలో మార్పులు అవసరం ప్రస్తుతమున్న పాఠ్యపుస్తకాలు కరోనాకాలం కన్నా ముందున్న 11 పేపర్లలకు కనుగుణంగా రాయబడ్డాయి. కానీ కరోనా కాలంలో పరీక్షా విధానాన్ని ఆరు పేపర్లకు తాత్కాలికంగా తగ్గించిన తర్వాత పాఠ్యాంశాలు కుదించకుండా తగ్గించిన ఆరు పేపర్ల విధానాన్ని కొనసాగించడంతో విద్యార్థుల్లో మరియు ఉపాధ్యాయుల్లో ఒత్తిడి పెరిగింది..

షెడ్యూలు ఒత్తిడిని తగ్గిస్తుందా?

ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను పదవ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించాలని బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వారు విడుదల చేసిన షెడ్యూలు విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడం అటు ఉంచితే, మానసిక ఆందోళనను పెంచుతుంది. ఒక సబ్జెక్టులకు 4,5 రోజుల విరామం కాకుండా ఒకటి,రెండు రోజుల విరామం ఉండాల్సింది.పరీక్షల షెడ్యూలు తయారు చేసే ముందు ఫీల్డ్ లో అనుభవం ఉన్న ఉపాధ్యాయుల సలహాలు తీసుకొని ఉండాల్సింది.ఏకంగా 35 రోజుల పాటు పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తే అన్ని రోజులు పాటు విద్యార్థులు పరీక్ష పై దృష్టిని నిలిపి ఉంచలేరూ.ఇది విద్యార్థుల్లో ఒక రకమైన నిరుత్సాహాన్ని పెంచుతుంది. పరీక్షల మధ్య ఎక్కువ వ్యవధి ఉండడంతో,విద్యార్థులు బయట తిరగడం వల్ల అనారోగ్యానికి గురి అయితే,ఇది మొత్తంగా పరీక్షల పై తీవ్రప్రభాతం చూపే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్,కేజీబీవీ, మోడల్ స్కూల్ లాంటి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరు నెల రోజులపాటు పదో తరగతి పరీక్షల్లో నిమగ్నమైతే హోం పరీక్షలపై ప్రభావం పడుతుంది.హోం పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్న, పరీక్షలను గుణాత్మకంగా నిర్వహించాలన్న సబ్జెక్ట్ ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలి.35 రోజులపాటు పదో తరగతి పరీక్షలు నిర్వహించిన వెంటనే మూల్యాంకనానికి సీనియర్ ఉపాధ్యాయులు వెళ్ళవలసి ఉంటుంది.ఇది 6,7,8,9 తరగతుల విద్యార్థులను హోం పరీక్షలకు తయారు చేయడం పై ప్రభావం చూపుతుంది. 10వ తరగతి విద్యార్థులు 35 రోజుల పాటు పరీక్షలు రాస్తే రెసిడెన్షియల్ పాఠశాలలో హోం ఎగ్జామ్స్ రాసే విద్యార్థుల పై ఆ ప్రభావం ఉంటుంది. నెల రోజులపాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడడం,వారికి పరీక్షలు సక్రమంగా నిర్వహించడం కత్తిమీద సామే అవుతుంది. సుదీర్ఘంగా ఉన్న పరీక్షల ప్రస్థానం వల్ల తదుపరి పాలిటెక్నిక్ లాంటి కాంపిటీషన్ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సమయం ఉండకపోవచ్చు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు అధిక భాగం గ్రామీణ ప్రాంత విద్యార్థులే కాబట్టి ప్రస్తుతం ప్రకటించిన 10వ తరగతి పరీక్షల షెడ్యూల్ ను పునర్ సమీక్షించవలసిందిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

(వ్యాసకర్త తెలంగాణ టీచర్స్ యూనియన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు)

ప్రాంతీయం

సంగారెడ్డిలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 30 : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా రామ్ నగర్ రామ్ మంధిర్ లో గరత్మంతుడు పై ఆసీనులైన సీతా రామ లక్ష్మణుల ను శావా పై ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కొన్ని దశాబ్దాలుగా వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీసీతా రామ లక్ష్మణుల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించడం ఆనవాయతీగా వస్తోంది. గరత్మంతుడి పై ఆసీనులైన లక్ష్మణ సహిత శ్రీ సీతా రామ చంద్రుల దేవతా మూర్తుల ఊరేగింపు లో జగ్గారెడ్డి తో పాటుగా పెద్ద ఎత్తున భక్తులు భజన లు చేస్తూ, పాటలు పాడుతూ పాల్గొన్నారు. జగ్గా రెడ్డి స్వయంగా భజన పాటలు పాడుతూ ఊరేగింపు లో పాల్గొన్నారు. రామ్ మందిర్ నుండి మొదలుకొని భవాని మందిర్ మీదుగా సంగారెడ్డి పట్టణం లో శావా తో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు అనంతరం రామ్ మందిర్ లో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం ఏర్పాటు చేశారు. రామ్ మందిర్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

స్వామి వారి పల్లకి సేవలో మంత్రి దామోదర

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ దంపతులు సంగారెడ్డి పట్టణం లో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం వైకుంఠ పురం శ్రీ వెంకటేశ్వర దేవాలయం లో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . స్వామి వారి పల్లకి సేవలో భక్తులతో కలసి పాల్గోన్నారు . దేవాలయం అభివృద్ధికి, రాజగోపురం నిర్మాణానికి మంత్రి కృషి చేస్తామన్నారు.

కొల్లూరు పోలీస్ స్టేషన్‌ను ఆర్‌సీపురం ఏసీపీ డివిజన్‌లో కలపాలి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి.

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 30 : కొత్తగా ఏర్పాటుచేసిన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంగారెడ్డి కొల్లూరు పోలీస్ స్టేషన్ ను రామ చంద్రపురం ఏసిపి డివిజన్ లో కలపాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. రామచంద్రపురం పట్టణంలోనీ నివాసంలో మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని పరిధిలోని పటాన్ చెరు, అమీన్ పూర్ లను సైబరాబాద్ కలపడం జరిగిందన్నారు. నూతనంగా విలీనమైన పటాన్ చెరు, అమీన్ పూర్ లను మియాపూర్ ఏసిపి పరిధిలోకి తీసుకురాగా కొల్లూరు పోలీస్ స్టేషన్ ను నార్సింగ్ లో కలపడం ద్వారా ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉంటుందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం పరిధిలో ఉన్న పటాన్ చెరు , అమీన్ పూర్, రామచంద్రాపురం, కొల్లూరు పోలీస్ స్టేషన్లను ఒకే చోటు కలిపి ఏసిపి డివిజన్ గా చేయాలని కోరారు. జిల్లా పరిధిలోని ఉన్న ఈ పోలీస్ స్టేషన్లను ఒక ఏసీపీ డివిజన్ గా చేయడం వలన ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందుతాయి అన్నారు. ఇది ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేసి , వెంటనే కొల్లూరు పోలీస్ స్టేషన్ ను రామ చంద్రపురం ఎసిపీ డివిజన్లోకి మార్చాలని డిమాండ్ చేశారు.

యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతుంది

- రైతులు ఆందోళన చెందవద్దు
- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 30: జిల్లాలో యూరియా ఎరువుల సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. జిల్లాలోని అన్ని పి ఏ సి ఎస్, సహకార సంఘాలు, అగ్రో కేంద్రాలు, హాక, డీసీఎంస్ కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా సరిపడినంత స్టాక్ అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 4,766 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, ఇందులోసహకార సంఘాల వద్ద 444 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల వద్ద 502 మెట్రిక్ టన్నులు, మార్క్ ఫెడ్ బఫర్ స్టాక్ 3,819 మెట్రిక్ టన్నులు ఉన్నాయని పేర్కొన్నారు. యూరియా సరఫరా విడతల వారీగా కొనసాగించబడుతున్నందున రైతులు ఎటువంటి ఆందోళనకు, అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా యూరియా పంపిణీ సక్రమంగా జరిగేలా అందరు ఏ డి ఎ లు, ఏవోలు, ఏఈఓ లు అందుబాటులో ఉండి నిరంతరం పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు వెల్లడించారు. రైతులందరూ ప్రశాంతత తో అవసరమైన మేరకు యూరియా కొనుగోలు చేయాలని కోరారు. అనవసరంగా అధికంగా కొనుగోలు చేయకుండా సహకరించాలని సూచించారు. యూరియా సరఫరా, పంపిణీ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

నూతన వేడుకల్ని చట్ట పరిధిలో జరుపుకోవాలి

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 30: డిసెంబర్ 31న బుధవారం రాత్రి జరిగే నూతన సంవత్సర వేడుకలను చట్ట పరిధిలో జరుపుకోవాలని రామగుండం సిపి అంబర్ కిషోర్జా తెలిపారు బుధవారం రాత్రి 10 గంటల నుండి తమ పోలీస్ సిబ్బంది మఫ్టీలో నుండి నిఘ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు చౌరస్తాలలో సీసీ కెమెరాలు మహిళా సిబ్బంది ట్రాఫిక్ సిబ్బంది వేడుకలపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు . ప్రజలు యువకులు మద్యం తాగి రాస్ డ్రైవింగ్ త్రిబుల్ రైడ్ డ్రైవింగ్ చేయరాదన్నారు మద్యం తాగి డ్రైవింగ్ చేసినవారిని చట్టపరిలో కేసులు నమోదు చేసి లైసెన్సులను రద్దు చేయనున్నట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్ని చట్ట పరిధిలో జరుపుకొని ప్రజలు ఆనందంతో గడపాలన్నారు.

హజ్ యాత్రికుల కోసం శిక్షణ శిబిరం

- మహమ్మద్ అలీ షబ్బీర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 30 : నిజామాబాద్ జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో బోధన్ రోడ్‌లోని నిజాం ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఏడాది హజ్‌కు వెళ్లనున్న యాత్రికుల కోసం హజ్ శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన శిక్షణ శిబిరంలో జిల్లాకు చెందిన హజ్ యాత్రికులందరూ పెద్ద సంఖ్యలో హాజరై శిక్షణ పొందారు. ఈ శిక్షణ శిబిరాన్ని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఖుస్రో పాషా పాల్గొని యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మత పండితులు హజ్ యాత్రకు సంబంధించిన ముఖ్యమైన ధార్మిక నియమాలు, విధి విధానాలు, హజ్ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, ప్రయాణ ఏర్పాట్లు, వసతి, రవాణా తదితర లాజిస్టిక్ అంశాలపై యాత్రికులకు సమగ్ర అవగాహన కల్పించారు. హజ్ యాత్రలో ఎదురయ్యే సమస్యలు, వాటికి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టంగా వివరించారు. మహిళా హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, ప్రత్యేక కూర్చోవడం మార్గనిర్దేశం ఏర్పాటు చేయడం విశేషం. శిక్షణ శిబిరంలో పాల్గొన్న హజ్ యాత్రికులు తమ సందేహాలను నేరుగా మత పండితులు, నిర్వాహకులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిక్షణ శిబిరం వల్ల హజ్ యాత్రను సక్రమంగా, భక్తి భావంతో, సురక్షితంగా నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందని యాత్రికులు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ హజ్ యాత్రికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తెలంగాణ నుంచి హజ్‌కు వెళ్లే ప్రతి యాత్రికుడికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. మక్కాలో కూడా ఇక్కడి నుంచి వెళ్లే హజ్ యాత్రికుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, సహాయ సేవలు, సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యులు, జిల్లా నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో హజ్ యాత్రికులు పాల్గొని శిక్షణ శిబిరాన్ని విజయవంతం చేశారు.

నగరంలో భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 30 : నిజామాబాద్ పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే సంకల్పంతో ప్రభుత్వం భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆధునిక వాటర్ ట్యాంకుల పనులకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శంకుస్థాపన చేశారు. అనంతరం పట్టణంలోని కేకే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం లో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ నిజామాబాద్ పట్టణంలో వేగంగా పెరుగుతున్న జనాభా, పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందుచూపుతో నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. "ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. నీరు ప్రజల ప్రాథమిక హక్కు. వేసవి కాలంలో ఒక్క ఇంట్లోనూ నీటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో ఈ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టాం" అని షబ్బీర్ అలీ అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఆటోనగర్ ప్రాంతంలో రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో 16 లక్షల లీటర్ల సామర్థ్యం గల భారీ వాటర్ ట్యాంకును నిర్మించనున్నట్లు తెలిపారు. దీని ద్వారా ఆటో నగర్‌తో పాటు పరిసర కాలనీలకు నిరంతర నీటి సరఫరా సాధ్యమవుతుందని అధికారులు వివరించారు. అలాగే సైలని నగర్‌లో రూ.1 కోటి 50 లక్షల వ్యయంతో 9 లక్షల లీటర్ల సామర్థ్యం గల మరో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ ట్యాంక్ వల్ల ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని చెప్పారు. ఇదే విధంగా మదీనా ఈద్గా సమీపంలో రూ.1 కోటి 50 లక్షల వ్యయంతో 9 లక్షల లీటర్ల కెపాసిటీ కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి

ముత్యం చారి రాజీనామా

ప్రతిపక్షం గుండాల, డిసెంబర్ 30: గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న కొడెం ముత్యం చారి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. వ్యక్తిగత,కారణాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించిన కొడెం ముత్యం చారి, అంచెలంచెలుగా ఎదిగి గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టారు. పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సమన్వయానికి, ప్రజా సమస్యలపై పోరాటాలకు ఆయన చేసిన సేవలు పార్టీ వర్గాల్లో గుర్తింపు పొందాయని నాయకులు పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష పదవి అప్పగించిన జిల్లా, రాష్ట్రస్థాయి కాంగ్రెస్ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిజామాబాద్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి బదిలీ

- నూతన కలెక్టర్‌గా ఇలా త్రిపాఠీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 30 : నిజామాబాద్‌జిల్లా కలెక్టర్‌వినయ్‌కృష్ణారెడ్డి బదిలీ ఆకస్మిక బదిలీ అయ్యారు. నూతన కలెక్టర్‌గా ఇలా త్రిపాఠీని బదిలీ చేస్తూ ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంవత్సరం జూన్ 14 నిజామాబాద్ కు వచ్చిన ఆయన అతి కొద్ది నెలల్లోనే బదిలీ కావడం జిల్లాలో సర్వత్ర చర్చనీయాంశమైంది. ఈయన స్థానం లో 2017 బ్యాచ్‌కు చెందిన త్రిపాఠి ప్రస్తుతం నల్గొండ జిల్లా కలెక్టర్‌గా ఉన్నారు. వినయ్ కృష్ణారెడ్డి జీహెచ్‌ఎంసీ పరిధిలోని మల్కాజ్‌గిరి, ఎల్‌బీనగర్ , ఉప్పల్ జోన్లకు అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. కృష్ణారెడ్డి జిల్లాలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలను సైతం ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పూర్తయ్యేలా ముందుండి నడిపించారు. అతిత్వరలోనే జరిగే మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సమీక్షలు సైతం నిర్వహిస్తున్నారు. ఇంతలోనే ఆయనను అనూహ్యంగా బదిలీ చేయడం తీవ్ర చర్చకు దారితీసింది.

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ఎన్పీడీసీఎల్ కట్టుబడి ఉంది

- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 30: విద్యుత్ శాఖలో విధి నిర్వహణ అనేది అత్యంత ప్రమాదంతో కూడుకున్నదని, అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే ఉద్యోగుల సంక్షేమం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఎల్లప్పుడూ ముందుంటుందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. మంగళవారం హన్మకొండ నక్కలగుట్ట లోని కార్పొరేట్ కార్యాలయంలో ఇటీవల విధి నిర్వహణలో మరణించిన జనగాం సర్కిల్, రఘునాథపల్లి సబ్ డివిజన్, నర్మెట్ట సెక్షన్ లో పనిచేసిన బానోత్ రవి అన్ మ్యాన్డ్ వర్కర్ భార్య బానోత్ నీలకు న్యూ ఇండియా ఎస్యూరెన్సు కంపెనీ తరపున రూపాయలు 20 లక్షలు , ఎన్పీడీసీఎల్ కంపెనీ నుండి రూపాయలు 5 లక్షల చెక్కును సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఉద్యోగులకు అండగా నిలబడేందుకు కోటి రూపాయల ప్రమాద బీమా, అన్ మ్యాన్డ్ వర్కర్ లకు 20 లక్షల ప్రమాద బీమా కల్పించామని చెప్పారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, క్షేత్రస్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఎల్సీ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఈ సందర్భంగా వివరించారు. ఎస్టీ అసోసియేషన్ నాయకులు బానోత్ రవి భార్య నీలకు ఉద్యోగం కల్పించాలని సీఎండీకి విన్నవించుకున్నారు. సీఎండీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సి . ప్రభాకర్ , సి.ఈ లు కె.రాజు చౌహన్, జయవంత్ రావు చౌహన్ , జనగాం ఎస్ఈ చెరుకు సంపత్ రెడ్డి , డి ఈ జనగాం లక్ష్మి నారాయణ రెడ్డి, ఏ.డీఈ రఘునాథపల్లి సుధాకర్ , ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు నందా రాథోడ్, టిజిఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు హర్జి జాటోత్ , ప్రధాన కార్యదర్శి అజ్మీరా శ్రీరామ్ నాయక్ , జనగాం జిల్లా అధ్యక్షులు బి . బాలు నాయక్ , సెక్రటరీ బి . చంద్ర భాను నాయక్ , రాంధన్ నాయక్ , తదితర నాయకులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో నేరాల నివారణ

- రోడ్డు ప్రమాదాలు తగ్గించగలిగాం
- డ్రంకన్ డ్రైవ్ తనిఖీలతో సత్ఫలితాలు
- వార్షిక క్రైమ్ రిపోర్ట్ వెల్లడించిన సీపీ సాయి చైతన్య

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 30 : పోలీస్ సిబ్బంది అంకితభావం, ప్రభుత్వ విభాగాల సమన్వయం, ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తున్నట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్లో 2025 వార్షిక క్రైమ్ రిపోర్ట్ ను మంగళవారం విడుదల చేశారు.

ఈ సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే ఓవరాల్ గా క్రైమ్ రేటు తగ్గినట్టు తెలిపారు. గతేడాది మొత్తం 8983 వివిధ నేరాలు నమోదు కాగా, 2025లో 8624 కేసులకు తగ్గినట్టు తెలిపారు. పిల్లలపై జరిగే నేరాల సంఖ్య 120 నుంచి 168కి పెరిగినట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చినట్టు సీపీ తెలిపారు. బ్లాక్ స్పోర్ట్స్ గుర్తించి ఆయా చోట్ల రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలతో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గినట్టు తెలిపారు. గతేడాది మొత్తం 857 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 353 మంది మృతిచెందగా, 782 మంది గాయపడ్డారని, 2025వ సంవత్సరంలో 780 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా 276 మంది మృతిచెందినట్టు తెలిపారు. ప్రమాదాలను తగ్గించడంతో పాటు మృతుల సంఖ్యను తగ్గించగలిగినట్టు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ పై ఉక్కుపాదం డ్రంకెన్ డ్రైవ్ నిరంతరం చేపట్టిన తనిఖీలతో మంచి ఫలితాలు వస్తున్నట్టు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో సైతం ఈ తనిఖీలు దోహదం చేస్తున్నట్టు తెలిపారు. గతేడాది మొత్తం 8410 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు కాగా.. ఈసారి విస్తృత తనిఖీలతో ఆ సంఖ్య 17,627 కు చేరిందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడంతో వారితో పాటు ఎదుటి వారికి కూడా ప్రమాదకరమని కావున ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. డ్రగ్స్ పై యుద్ధం రానున్న సంవత్సరంలో కొన్ని లక్ష్యాలతో ముందుకు వెళ్తున్నట్టు సీపీ తెలిపారు. ప్రధానంగా డ్రగ్స్పై యుద్ధం చేయనున్నామని తెలిపారు. ఇది వరకే కళాశాలల్లో, గ్రామాల్లో పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఇది మరింత విస్తరించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు డి.సి.పి (అడ్మిన్) జి. బస్వా రెడ్డి , నిజామాబాదు ఏసిపి రాజా వెంకటరెడ్డి ,బోధన్ ఎసిపి శ్రీనివాస్ , ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర్ రెడ్డి , ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ , సైబర్ క్రైమ్ ఏసిపి వై. వెంకటేశ్వర్ రావ్ , స్పెషల్ బ్రాంచ్ సిఐ శ్రీశైలం మరియు యూ సిఐలు ఎస్సైలు సిసిఆర్బి సీఐ వీరయ్య , ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.



రాష్ట్రంలో యూరియా సరఫరా కొనసాగుతోంది. రైతులు ఆందోళన చెందవద్దు. రబీ సీజన్ లో కేంద్రం రాష్ట్రానికి 20.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించింది. ఇప్పటివరకు అందిన 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో 3.71లక్షల మెట్రిక్ టన్నుల రైతులు కొనుగోలు చేశారు. 2.15 లక్షల మెట్రిక్ టన్నుల జిల్లాల్లో అందుబాటులో ఉంది.

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రాంతీయం

ఘనంగా వైకుంఠ ఏకాదశి

- **ఉత్తర ద్వారం గుండా వెంకటేశ్వరా స్వామిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 30 : వేంకటేశ్వర స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు అందరు సుభిక్షంగా ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళ వారం మెదక్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కోదండ రామాయలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి సేవలో భక్తులతో కలిసి పాల్గొని పల్లకి మోశారు .ఈ సందర్బంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది అన్నారు.ప్రజలందరికి వైకుంఠ ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపతో రాష్ట్ర జలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయం,వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు బండ. నరేందర్,కంచి మధుసూదన్,మెదక్ మార్కెట్ మాజీ చైర్మన్ కృష్ణ రెడ్డి,మాజీ కౌన్సిలర్ లు ఆర్కె శ్రీనివాస్, వంజరి. జయరాజ్ ,మాయ. మల్లేశం, నాయకులు లింగారెడ్డి, మహిపాల్ రెడ్డి ,మోహన్ నాయక్,శ్రీను నాయక్ ,రంజిత్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోచమ్మరల్‌లో పూరి గుడిసె దగ్ధం

- **బాధిత కుటుంబానికి యంగ్ స్టార్స్ ఫౌండేషన్ చేయూత**

ప్రతిపక్షం,మెదక్ టౌన్, డిసెంబర్ 30: మెదక్ జిల్లా హవేళిఘనాపూర్ మండలం పోచమ్మరల్ గ్రామానికి చెందిన వడ్డే నాగమణి పూరి గుడిసె ప్రమాదవశాస్తూ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది.ఈ ఘటనలో ఇంట్లోని వస్తువులు అన్ని కాలి బూడిదయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న యంగ్ స్టార్ ఫౌండర్ రాగి వనజ ,ఉపాధ్యక్షులు వారణాసి సౌమ్య సంతోష్,గోవింద రాజు మంగళవారం పోచమ్మరల్ గ్రామానికి చేరుకొని వడ్డే నాగమణిని పరామర్శించారు. వారికి నిత్య అవసర సరుకులు, దుస్తులు, బ్లాంకెట్స్ మరియు ఇతర వస్తువులు అందజేశారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పోచమ్మరల్ గ్రామ సర్పంచ్ రాజు,వార్డ్ సభ్యులు తదితలు ఉన్నారు.

నేత్ర పర్వంగా వైకుంఠ ఏకాదశి

ప్రతిపక్షం, తొగుట, డిసెంబర్ 30: వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్బంగా తొగుట మండలంలోని వెంకట్రావుపేట లో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. వెంకట్రావుపేట లోని వేణుగోపాలస్వామి దేవాలయం, వెంకటేశ్వర దేవాలయాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకున్నారు.. తెల్లవారు జామున నుండే స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు తరలి వెళ్ళారు..అనంతరం వేణుగోపాలస్వామి దేవాలయం లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.. సాయంత్రం స్వామి వారిని గరుడ వాహన సేవలో గ్రామం లో ఊరేగించారు.. కార్యక్రమం లలో గ్రామ సర్పంచ్ బండారు కవిత స్వామి గౌడ్, వార్డ్ మెంబర్లు పిట్ల వెంకట్, వడ్డే లలిత, పులిగారి శ్యామల, ఆలయ కమిటీ చైర్మన్ రాయారావు రఘుపతి రావు కమిటీ సభ్యులు, కల్లెపు భాస్కర్, నరేష్,ఈదుగాళ్ల మల్లేశం, కనకయ్య, శ్రీనివాస్,తో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలతో విద్యార్థుల ప్రతిభకు మెరుగు

- **ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి, జిల్లా విద్యాధికారి, సిద్దిపేట**

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, డిసెంబర్ 30: ప్రతిభా పరీక్షలు విద్యార్థులలో పరీక్షల పట్ల భయాన్ని తొలగించి పోటీ పరీక్షల పట్ల అవగాహనను పెంచుతాయని సిద్దిపేట జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఇబ్రహీంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుండా వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి, నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి, టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు వంటేరు సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి ఎల్లెంకి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరచూ ప్రతిభా పరీక్షలను రాయాలని చెప్పారు. దీనివల్ల తమ ప్రతిభను మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు గణిత పరీక్షలను రాసేటప్పుడు సమస్యలను సాధించే క్రమంలో వేగంతో పాటు ఖచ్చితత్వాన్ని పాటించాలని చెప్పారు. యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని చెప్పారు. గణితశాస్త్రం కేవలం పరీక్షల్లో మార్కులు తెచ్చే ఒక విషయం మాత్రమే కాదన్నారు. జీవితాన్ని సరైన దిశలో నడిపించి ఆలోచనా శక్తిని పెంపొందించేది గణిత శాస్త్రమన్నారు. ప్రపంచానికి గణితం గొప్పతనాన్ని పరిచయం చేసిన మహానుభావుడు శ్రీనివాస రామానుజన్ అని చెప్పారు. ఆయన జీవితం ప్రతి విద్యార్థికి ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిభా పరీక్షల్లో చేసే పొరపాట్లను సరిదిద్దుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలని సూచించారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు విద్యార్థులు తమ అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. టీఎంఎఫ్ జిల్లా అధ్యక్షుడు వంటేరు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ విజ్ఞానాన్ని మెరుగుపరచుకుంటేనే రాణిస్తారని చెప్పారు.పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. టీఎంఎఫ్ రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు పి.అశోక్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు వి.అజయ్, టీఎంఎఫ్ సిద్దిపేట జిల్లా కోశాధికారి వేంకటేశ్వర్, సెక్టోరియల్ అధికారి రామస్వామి,మండల విద్యాధికారులు పి.తిరుపతి, కె.రాజిరెడ్డి, మహతి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు’ ఉత్తదేనా?

- **నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీష్ రావు లేఖ**



ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 30: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నపూర్ణ, రంగనాయకసాగర్, శ్రీకొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లపై గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. ఈ మేరకు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి లేఖ రాసి రైతుల తరపున విజ్ఞప్తి చేశారు. 2020 నుంచి 2023 వరకు ఈ రిజర్వాయర్లకు సంబంధించిన ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ కాలువలను పూర్తి చేసి సిద్దిపేట జిల్లాలో సుమారు లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించామని హరీష్ రావు గుర్తు చేశారు. ప్రతి యాసంగిలో కాలువల ద్వారా చెరువులు, కుంటలు, వాగులు, చెక్ డ్యాములు నింపి నేరుగా ఆయకట్టుకు నీళ్లు అందించడంతో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. దీని వల్ల పంట దిగుబడులు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. కానీ 2023 తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ రిజర్వాయర్లకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా ఒక్క గజం కాలువ కూడా తవ్వలేదని విమర్శించారు. మైనర్, సబ్ మైనర్ కాలువల నిర్మాణానికి భూసేకరణ అవసరమని, ఈ విషయాన్ని లేఖల ద్వారా, ఫోన్ల ద్వారా, వ్యక్తిగతంగా కలసి పలుమార్లు వివరించినా స్పందన లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నినాదం ప్రకారం ‘తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు’ అనే మాట నిజమా? అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ సాగు సిద్దిపేట జిల్లాలో సాధ్యమని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా అన్నపూర్ణ (అంతగిరి) రిజర్వాయర్ ప్యాకేజ్-10కు రూ.15 కోట్లు, రంగనాయకసాగర్ ప్యాకేజ్-11కు మరో రూ.15 కోట్లు కేటాయించాలని లేఖలో కోరారు. మొత్తం రూ.30 కోట్లతో భూసేకరణ పూర్తయితే అదనంగా మరో లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుందని సూచించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కొత్త ఆయకట్టు ముందుకు సాగడం లేదని, వేలాది మంది రైతులు మీ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1,15,42,056

ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 30: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో 49 రోజుల హుండీ ఆదాయం రూ.01 కోటి 15 లక్షల 42 వేల 056 వచ్చింది. మంగళవారం కొమురవెల్లిలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ముఖమండపంలో ఆలయ ఈఓ టంకశాల వెంకటేష్, ఆలయ చైర్మన్ నరసింహ్మారెడ్డిల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్బంగా మల్లన్న ఆలయంలోని మొత్తం హుండీలను లెక్కించగా మొత్తం నగదు రూ. 1,15,42,056, మిశ్రమ బంగారం 60 గ్రాములు, మిశ్రమ వెండి 5 కిలోల 5 గ్రాములు, 50 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. వచ్చిన మొత్తం డబ్బులను స్థానిక SBI బ్యాంకులో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ బుద్ది శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ కమిటీ చైర్మన్ గంగం నర్సింహ్మారెడ్డి, ధర్మకర్తలు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, చిగురు కొమురయ్య, అర్చకులు, ఆలయ సిబ్బంది, శ్రీలలిత సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.కాగా కొమురవెల్లి ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బందితో బందోబస్త్ నిర్వహించారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు

ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 30: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని నియోజకవర్గంలోని వర్గల్ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం, నాచారం లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, గజ్వేల్ వెంకటేశ్వర స్వామి ఆలయాలు మంగళవారం పాతకాలం నుండి "గోవింద" నామస్మరణతో మార్మోగాయి. ఆలయాలకు విచ్చేసిన భక్తులు "ఉత్తర ద్వారా దర్శనం"తో వారి హృదయాలు పులకించి పోయాయి. ఈ సందర్బంగా వర్గల్ ఆలయంలో సరస్వతీదేవి ఆలయ వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ యాయావరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి విశేష అభిషేకము, లక్ష తులసి అర్చన, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ ఉత్తర ద్వారా దర్శనానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. నాచారం గుట్ట, లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం ఇవ్వడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి విజయరామారావు ఆలయ చైర్మన్ రవీందర్ గుప్తా పాలక మండలి సభ్యులు గాలి కిష్టయ్య ,చందనాగరాజు, కొత్తపల్లి శ్రీనివాస్, రుద్ర శ్రీహరి, ఉష రాజశేఖర్ శర్మ, కర్రె పద్మ వెంకటేశం,నాయకం శ్రీనివాస్ నాచారం గ్రామ సర్పంచ్ సారిక యాదగిరి, ఉప సర్పంచ్ వినయ్ అధిక సంఖ్యలో భక్తులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రక్రియ వేగవంతం చేయాలి

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్30: జిల్లాలోని మున్సిపల్ మున్సిపాలిటీల పరిధిలో గల వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్ ప్రత్యేక అధికారులు మున్సిపల్ కమిషనర్ తో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ప్రణాళిక అధికారులతో వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు పై సంబంధిత విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .మున్సిపాలిటీల పరిధిలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా స్పష్టంగా రూపొందించాలని తెలిపారు. వార్డులలో నివాస ప్రాంతాలకు సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు మంచి ప్రాంతాలను గుర్తించాలన్నారు. వార్డుల వారీగా తుది ఓటరు జాబితాలతో పాటు పోలింగ్ కేంద్రాలను కూడా ఖరారు చేసి జనవరి 10న ప్రకటించాలని ,ఆ ఆదేశాల్లో స్పష్టం చేసిందన్నారు. ఈ నెల 30న మున్సిపాలిటీల వారీగా వివరాలు సరిచూసుకోవాలని, 31వ తేదీన వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితాలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. జనవరి 1న పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాల ముసాయిదా ప్రకటించాలని స్పష్టం చేశారు. 5వ తేదీన మున్సిపల్ కమిషనర్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో, 6వ తేదీన జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని వివరించారు.10వ తేదీన పోలింగ్ స్టేషన్ల వారీగా ఫైనల్ ఓటర్ల జాబితాలు ప్రకటించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, నియోజకవర్గ మున్సిపల్ కమిషనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై

మంత్రి స్పందన

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 30: తెలంగాణ ఉపాధి కల్పన, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులను నివాసంలో కలిశారు. భద్రత, పెండింగ్ జీతాల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం అందజేశారు. మంత్రి ఈ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరగబోతోందని, ఉద్యోగులకు న్యాయం కల్పిస్తారని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ పుల్లగుర్ల రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పొన్నమల్ల యాదగిరి పాల్గొన్నారు.

బ్యాంక్ సేవల గురించి అవగాహన కళాజాత

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ (నిజాంపేట్), డిసెంబర్30: నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మంగళవారం రోజున నిజాంపేట బ్రాంచ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ నాబార్డ్ సౌజన్యంతో ఆర్థిక అవగాహన సదస్సు నస్కల్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కళాజాతి బృందం తో బ్యాంక్ మేనేజర్ రాజకుమార్ మాట్లాడుతూ బ్యాంకు సేవలపై, ఇన్సూరెన్స్, ప్రైవేటు బ్యాంకుల లో జరిగే మోసాలు సైబర్ మోసాలు రైతులకు, పంట రుణాలు, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి, ప్రతి ఒక్కరూ ఖాతాలు ఉన్న అందరు కూడా ఇన్సూరెన్స్ లు చేసుకోవాలి, నిజాంపేట్ బ్రాంచ్ మేనేజర్ తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కళాజాతి బృందం మరియు ఛానల్ మేనేజర్ వెంకటేష్ బ్యాంకు మిత్ర పిట్ల మౌనిక పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనంతో ముక్కోటి ఏకాదశి వైభవం

- **ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు..**

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్30: ఆలయాల ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వైష్ణవ సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన రోజుగా భావించే ఈ రోజున, ఆలయ ప్రాంగణాలు భక్తి పారవశ్యంతో నిండిపోయాయి. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చారు. సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు చేర్యాల, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక, కొమురవెల్లి తదితర ప్రాంతాల్లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలు, విష్ణు దేవాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. సిద్దిపేట పట్టణంలోని మోహినీపుర వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచే స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లు, బ్యారికేడ్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి, భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. సిద్దిపేట కోటి లింగాల దేవాలయం భక్తులతో నిండి పోగా, దుబ్బాకలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. అలాగే మిరుదొడ్డి మండలంలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం, సీతా రామాంజనేయ స్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. మోతే గ్రామంలోని లక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ముక్కోటి ఏకాదశి వైభవాన్ని ప్రతిబింబించాయి. జిల్లా కలెక్టర్ హైమావతి, మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు దంపతులు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి పూజల, హరికృష్ణ, ఆయా పార్టీల నాయకులు, ప్రముఖులు ఉత్తర దర్శనం ద్వారా మోహినపుర వేంకటేశ్వర స్వామి నీ దర్శించుకున్నారు.

ఘనంగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి..

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల మిట్టపల్లి గ్రామాలలో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుండి భక్తులు ఆలయాల చేరుకొని పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మిట్టపల్లి సర్పంచ్ చింతల శ్రీనివాస్, పొన్నాల ఉపసర్పంచ్ సృజనా సంపత్ యాదవ్, శ్రీనివాస్, కుంభోజు శివకుమార్, జెపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

“

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ఉంటాయనే భయంతో న్యూ ఇయర్ వేడుకల వేళ చౌరస్తాల్లో సందుల్లో దూరి, ప్రమాదకరంగా వాహనాలు నడపడం విజ్ఞత అనిపించుకోదు. మద్యం మత్తులో వాహనం నడపడం మృత్యువును ఆహ్వానించడమే. ఒకవేళ యముడు వదిలేసినా చట్టం వదలదు. ‘మీ ప్రాణం విలువ మాకు తెలుసు. కాబట్టే ఈ హెచ్చరిక’.

- హైదరాబాద్ సీపీ సజ్జనార్

చొరబాటుదారులను నేషనల్ గ్రిడ్‌తో నిలువరిస్తాం

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్‌కతా, డిసెంబర్ 30: పశ్చిమబెంగాల్ లో బీజేపీ అధికారంలోకి వస్తే చొరబాటుదారులను వెనక్కి పంపుతామని కేంద్ర హోం మంత్రి హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. దేశంలోకి చొరబాటుదారులను నిలువరించేందుకు నేషనల్ గ్రిడ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న పశ్చిమబెంగాల్‌లో మూడ్రోజుల పర్యటనలో భాగంగా మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడారు. 'బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే బెంగాల్ వారసత్వాన్ని, అభివృద్ధిని పునరుద్ధరిస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నాం. పేద ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తాం. చొరబాట్లకు అడ్డుకట్ట వేసేందుకు నేషనల్ గ్రిడ్ ఏర్పాటు చేస్తాం' అని అమిత్‌షా తెలిపారు. మమతా బెనర్జీ సర్కార్‌పై అమిత్‌షా విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలకు ఉద్దేశించిన కేంద్ర సంక్షేమ పథకాలను బెంగాల్ సీఎం అడ్డుకుంటున్నారని విమర్శించారు. గత 14 ఏళ్లలో మమతా బెనర్జీ పాలనలో అవినీతి, భయాందోళనలు పెరిగిపోయాయన్నారు. ప్రభుత్వ అవినీతి కారణంగా బెంగాల్ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. 2026 ఏప్రిల్ 15 తర్వాత బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రాగానే బెంగాల్ వారసత్వం, సంస్కృతిని పునరుద్ధరిస్తామని చెప్పారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడింట రెండు వంతుల మెజారిటీతో అధికారంలోకి వస్తుందని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. బెంగాల్ సరిహద్దు నుంచే చొరబాట్లు జరుగుతున్నాయని, ఇక్కడ నుంచి చొరబాట్లను నిలిపివేసి, చొరబాటుదారులను వెనక్కి పంపించే ప్రధాన అంశంపైనే బెంగాల్ ఎన్నికల్లో తమ పార్టీ ఎన్నికలకు వెళ్తుందని తెలిపారు. 2026 ప్రథమార్ధంలో పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఎన్నికల తేదీలను ఎలక్షన్ కమిషన్ ప్రకటించాల్సి ఉంది.

విశ్వ వీక్షణం

బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని ఖలీదా జియా కన్నుమూత

బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా(80) మంగళవారం కన్నుమూశారు. ఛాతి ఇన్ఫెక్షన్లు, కాలేయం, మూత్రపిండాల సమస్యలు సహా గత అనేక సంవత్సరాలుగా ఆమె ఆరోగ్యపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. 1991 నుంచి 1996 వరకు, తిరగి 2001 నుంచి 2006 వరకు రెండు పర్యాయాలు ఖలీదా బంగ్లాదేశ్ ప్రధానిగా పనిచేశారు. బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రెహ్మాన్ భార్య ఖలీదా జియా. ఆమె పెద్ద కుమారుడు, బీఎన్‌పీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ తారీఖ్ రెహ్మాన్ 2008 నుంచి లండన్‌లో నివసిస్తూ డిసెంబర్ 25న బంగ్లాదేశ్ తిరిగి వచ్చారు. ఫిబ్రవరిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఖలీదా జియా నామినేషన్ పత్రాలను సోమవారం ఆమె పార్టీ నాయకులు సమర్పించారు. భారత విదేశాంగ మంత్రి జైశంకర్.. జియా అంత్యక్రియలకు హాజరుకానున్నారు.

గొప్ప దార్శనికురాలు

ఢాకాలో మాజీ ప్రధానమంత్రి, బీఎన్‌పీ చైర్ పర్సన్ ఖలీదా జియా మరణించిన వార్త విని ఎంతో బాధపడ్డాను. ఆమె కుటుంబానికి, బంగ్లాదేశ్ ప్రజలందరికీ మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం ఆమె కుటుంబానికి ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా, ఆ దేశ అభివృద్ధికి భారత్ బంగ్లా సంబంధాలకు ఆమె చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుంది. 2015 లో ఢాకాలో ఆమెతో ఒక సమావేశంలో పాల్గొన్నా. ఆమె గొప్ప దార్శనికురాలు, ఎప్పటికీ మాలాంటి వారికి మార్గనిర్దేశం చేస్తూనే ఉంటారని ఆశిస్తున్నాం' అంటూ ప్రధాన మంత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

రెండు రోజుల్లో కొత్త సంవత్సరం రాబోతోంది. రాబోయే కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కొన్ని కొత్త పద్ధతులు అవలంబించడానికి తీర్మానాలు చేస్తుంటారు చాలా మంది. ఈసారి కూడా అలాంటి తీర్మానం చేసి దాన్ని నెరవేర్చేందుకు కుటుంబసభ్యులు సమిష్టిగా ఎందుకు కృషి చేయడం లేదు?

అనుకోండి... ఆచరించండి!!

క్యాలెండర్ మారబోతోంది. ఈ సమయంలో మీరు కొత్తగా ఏదైనా చేయాలని లేదా జీవితంలో మార్పు తీసుకురావడానికి మరోక అవకాశం. ప్రతిజ్ఞలు, తీర్మానాలు అందరూ చేస్తారు. కానీ, ఆ ప్రయత్నం ప్రారంభ రోజులలో సరైన మార్గంలో ఉంటుంది, కాలక్రమేణా అది జ్ఞాపకాలల్లోని ఉంటుంది తప్ప ఆచరణలో మాత్రం ఉండదు. తల్లిదండ్రులుగా, పిల్లలు నిర్దేశించుకున్న లక్ష్యాలను మధ్యలోనే ఎందుకు వదిలేస్తున్నారో ఆలోచించాలి. అటువంటి పరిస్థితిలో, మీ మందలింపు పిల్లలకు నచ్చకపోవచ్చు. ఎందుకంటే వారి లక్ష్యం చేరుకోకపోవడంతో పిల్లలు దాని పర్యవసనాలను కూడా అనుభవిస్తుంటారు. కాబట్టి కాబట్టి వారి లక్ష్యాలను విడిచిపెట్టినందుకు మందలించే బదులు ఈసారి వారికి ఎందుకు మద్దతు ఇవ్వకూడదు!

ఏం చేయాలి...?

ఈ సంవత్సరం, వ్యక్తిగత తీర్మానాలతో పాటు, కుటుంబంలోని ప్రతి సభ్యుడు పాల్గొనే కొన్ని తీర్మానాలను కూడా తీసుకోండి. సమిష్టిగా ఏది చేసినా దానిని సాధించగలుగుతామనే నమ్మకంతో కుటుంబ సమేతంగా వాటి ఆచరణకు ముందుకు రండి. ముందుగా మీరు మీ పిల్లల్లో చూడాలనుకుంటున్న, మీరు ఆశించే లక్ష్యాలకు సంబంధించిన అలవాట్లను అలవర్చుకోండి. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ఎవరైనా తడబడితే, మిగిలిన కుటుంబ సభ్యులు మీకు సపోర్ట్‌గా ఉంటారు. ఇది మీ మనో సంకల్పాన్ని దారి తప్పకుండా కాపాడుతుంది. కుటుంబ సమేతంగా ఉన్నప్పుడు ఏ విషయంలో అయినా ఓటమి ఉండదన్నది తెలుసుకోండి. కొత్త సంవత్సరం తీసుకున్న నిర్ణయాలు అమలు పరచడంలో వ్యక్తిగతంగా సఫలీకృతం కాకపోయినప్పటికీ, కుటుంబం కలిసి తీసుకున్న నిర్ణయాల్లో కుటుంబ బంధం దాని ఆచరణ బలంగా ఉంటుంది.

కలిసి చేసే ఆచరణలు ఎక్కువ సఫలం అవుతాయి

ఈ న్యూ ఇయర్, మొత్తం కుటుంబాన్ని సంతోషపెట్టే తీర్మానాన్ని తీసుకోండి. కాబట్టి ఎవరైనా తడబడితే, అవతలి వ్యక్తి సహాయ హస్తం అందిస్తారు. దీంతో మీరు బలమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఇలాంటి తీర్మానాలు ఎవరినీ నిందించడానికి లేదా అవమానించడానికి కాదు. ఒకరితో ఒకరు నేర్చుకోవడానికి మరియు మెరుగ్గా మారడానికి ఇది ఒక అవకాశం.

అద్భుతమైన మార్పులు కనిపిస్తాయి

ఉదాహరణకు, మీరు ఒకరితో ఒకరు గౌరవంగా మాట్లాడాలని ప్రతిజ్ఞ చేస్తే, మీరు మొదటి రోజు నుండి దీన్ని అమలు చేయడం ప్రారంభించాలి. మీ పిల్లలతో పూర్తి గౌరవంతో మాట్లాడితే, వారు కూడా మిమ్మల్ని కొత్త ఆశతో చూస్తారు. ఈ ఆచరణల వల్ల పిల్లల్లో ఒక మెరుపు మీరు చూస్తారు. వారు హ్యాపీగా ఉండడం మీరు గమనిస్తారు. ఏడు రోజులు గౌరవంగా మాట్లాడిన తర్వాత పిల్లల్లో మార్పును కచ్చితంగా గమనిస్తారు. వారు తన చిన్నచిన్న చింతలు, భయాలు ఆనందాలను ఎటువంటి సంకోచం లేకుండా మీతో పంచుకుంటారు. స్కూల్లో ఎవరైనా వేధిస్తే ధైర్యంగా మీతో చెప్తారు. ఏదైనా కొత్తగా నేర్చుకున్నట్లయితే, అది మీతో గర్వంగా పంచుకుంటారు. ఈ సమయంలో పిల్లలు మునుపటి కంటే ఎక్కువగా మిమ్మల్ని విశ్వసించడం ప్రారంభిస్తారు. ఒక నెలపాటు నిరంతరంగా గౌరవంగా మాట్లాడటం వల్ల కలిగే ప్రభావం మీ పిల్లల ప్రవర్తనలో స్పష్టంగా కనిపిస్తుంది. మీ బిడ్డ కూడా మీలాగే ప్రవర్తించడం నేర్చుకుంటారు. వారు చిన్న విషయాలలో ధన్యవాదాలు, క్షమించండి, దయచేసి వంటి పదాలను ఉపయోగించడం ప్రారంభిస్తారు. పిలల్లు తమ తోబుట్టువులు మరియు స్నేహితుల పట్ల మరింత మర్యాదగా ఉండటమే కాకుండా, వారి మాటలు కూడా మరింత మధురంగా ఉంటాయి. ఇలా చేస్తే ఇంటి వాతావరణంలోకి పాజిటివ్ ఎనర్జీ వస్తుంది. ప్రేమ, గౌరవం ప్రభావం ఎంత లోతుగా మీ ఫ్యామిలీలోకి వచ్చి చేరిదో చేరిందో మీరు దానిని ఎంజాయ్ చేస్తారు. 365 రోజుల తర్వాత, మీకు, మీ పిల్లల మధ్య సంబంధం పూర్తిగా మారుతుంది. వారు మీతో ప్రతిదీ పంచుకోవడమే కాకుండా, మిమ్మల్ని తన బెస్ట్ ఫ్రెండ్‌గా కూడా భావిస్తారు. మీ మధ్య జరిగే ప్రతి సంభాషణ ప్రేమ, నమ్మకం, గౌరవంతో నిండి ఉంటుంది. పిల్లల ఆత్మవిశ్వాసం విపరీతంగా పెరుగుతుంది.

2026లో మాట్లాడుకుందాం

- సీఎం మార్పుపై డీకే అనూహ్య సంకేతం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, బెంగళూరు, డిసెంబర్ 30: ముఖ్యమంత్రి పదవిపై ఆశలు సజీవంగా ఉన్నట్టు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంకేతాలిచ్చారు. 2026లో సీఎం కానున్నారా అని మంగళవారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన నవ్వుతూ '2026లో మనం మాట్లాడుకుందా' అని సమాధానమిచ్చారు. సుపరిపాలన అందించాలన్నదే తమ కొత్త సంవత్సర సంకల్పమని డీకే చెప్పారు. 'ఈ ఏడాది లాగే వచ్చే ఏడాది కూడా రాష్ట్రంలో పుష్కలంగా వానలు పడాలని ప్రార్థిస్తున్నా. ప్రజా సాధికారత కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ హామీ పథకాలు కొనసాగుతాయి. స్థానిక సంస్థల ఎన్నికలు కూడా వచ్చే ఏడాది నిర్వహిస్తాం' అని తెలిపారు. సుపరిపాలన మీ నాయకత్వంలోనే అందించనున్నారా అని అడిగినప్పుడు, కాంగ్రెస్ ప్రభుత్వంలో సుపరిపాలన కొనసాగుతుందన్నారు. మరో ఏడున్నరేళ్ల పాటు కాంగ్రెస్ సుపరిపాలన కొనసాగుతుందని, 2028 ఎన్నికల్లో కూడా పార్టీ విజయం సాధిస్తుందని చెప్పారు. కాగా, 202627 బడ్జెట్‌ను కూడా తానే ప్రవేశపెడుతున్నట్టు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గత నవంబర్‌లో తెలిపారు. రాష్ట్ర ఆర్థిక మంత్రిగా ఇది తన 17వ బడ్జెట్ అవుతుందన్నారు. పార్టీ అధిష్టానం మొగ్గు తనవైపే ఉందని పరోక్షంగా సంకేతాలిచ్చారు. 2026 మార్చిలో కర్ణాటక వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు.

పుతిన్ నివాసంపై దాడిని ఖండించిన ప్రధాని మోడీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 30: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి డ్రోన్లతో దాడికి ప్రయత్నించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. శాంతికి దౌత్యం ఒక్కటే సరైన మార్గమని పేర్కొన్నారు. తాజా పరిణామాలపై తాము తీవ్ర ఆందోళన చెందుతున్నామని, ఇలాంటి చర్యల వల్ల మరింత ఉద్రిక్తతలు పెరుగుతాయని అన్నారు. శాంతి ప్రయత్నాలపైనే ఇరువర్గాలు దృష్టిసారించాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మోదీ కోరారు. రష్యాలోని నోవ్‌గరాడ్ ప్రాంతంలోని పుతిన్ నివాసంపై ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం డ్రోన్లతో దాడికి ఉక్రెయిన్ ప్రయత్నించిందని, 91 దీర్ఘశ్రేణి డ్రోన్లను ఆ దేశం ప్రయోగించిందని రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ ధ్రువీకరించారు.

అయితే వీటిని నిర్వీర్యం చేశామని, ఇలాంటి చర్యల వల్ల రష్యా సంప్రదింపుల ప్రక్రియపై తీవ్ర ప్రభావం ఉంటుందని హెచ్చరించారు. ఉక్రెయిన్‌పై సరైన సమయంలో దాడిచేసే హక్కు తమకుందని స్పష్టం చేశారు. రష్యాఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందానికి సంప్రదింపులు సాగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం పుతిన్ నివాసంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి యత్నాన్ని తీవ్రంగా ఖండించారు. తాను చాలా ఆగ్రహంతో ఉన్నట్టు చెప్పారు. పుతిన్ స్వయంగా తనకు ఫోన్ చేసి దాడి సమాచారం తెలియజేశారని అన్నారు.

వచ్చే ప్రభుత్వం మనదే

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, డిసెంబర్ 30: వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని, అదే సమయంలో రెండోమారు అధికారంలోకి రానున్న ద్రావిడ తరహా పాలన మహిళాభ్యుదయానికే అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. తిరుప్పూరు జిల్లా పల్లడం మైదానంలో 'వెల్లుమ్ తమిళగ పెణ్‌గళ్' పేరుతో డీఎంకే మహిళా విభాగం పడమటి మం డల మహానాడు ఆ విభాగం అధ్యక్షురాలు, ఎంపీ కనిమొళి అధ్యక్షతన జరిగింది. ఈ మహానాడులో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ ఈ మహానాడుకు హాజరైన మహిళలను చూస్తూంటే మరోమారు డీఎంకేకు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారనే భావన తనకు కలుగుతోందన్నారు. మహానాడును ఇంత గొప్పగా ఏర్పాట్లు చేపట్టిన తన సోదరి కనిమొళి బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. రానున్నది మహిళా సంక్షేమ పాలన కనుకనే ప్రస్తుతం డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో తయారీ చేసే బాధ్యత కూడా కనిమొళికి అప్పగించానని తెలిపారు. రాష్ట్రంలో పెరియార్, అన్నాదురై వంటి మహాపురుషులు మహిళాభ్యుదయం కోసమే తీవ్రంగా పాటుపడ్డారని గుర్తు చేశారు.



ఆటలు

@prathipaksham

prathipaksham tv telugu

ప్రపంచ చెస్ వేదికపై కొత్త చరిత్ర

కాంస్యం కొట్టిన వరంగల్ కుర్రాడు

అంతర్జాతీయ చెస్ వేదికపై భారత త్రివర్ణ పతాకం మరోమారు సగర్వంగా రెపరెపలాడింది. తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ కొత్త చరిత్ర లిఖించాడు. ఇప్పటికే ప్రతిష్టాత్మక ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిసిన అర్జున్ తాజాగా బ్లిట్జ్‌లోనూ సత్తాచాటాడు. ప్రత్యర్థులకు దీటైన సవాల్ విసురుతూ ముందుకు సాగిన అర్జున్ మరో కాంస్య పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. మంగళవారం చివరి వరకు హోరాహోరీగా సాగిన మెగాటోర్నీలో అర్జున్ తనదైన రీతిలో ప్రత్యర్థులకు చెక్‌పెడుతూ ముందుకుసాగాడు. ఈ క్రమంలో మెగా టోర్నీలో రెండు కాంస్య పతకాలు సాధించడం ద్వారా ఈ యువ గ్రాండ్‌మాస్టర్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. వరల్డ్ బ్లిట్జ్ టోర్నీలో పతకం గెలిచిన చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, వైశాలి తర్వాత మూడో భారత జీఎంగా అర్జున్ నిలిచాడు. దీనికి తోడు ఆనంద్ తర్వాత ర్యాపిడ్, బ్లిట్జ్ రెండింటిలో పతకాలు సాధించిన రెండో భారత ప్లేయర్‌గానూ ఈ వరంగల్ కుర్రాడు కొత్త ఘనత సొంతం చేసుకున్నాడు. ఒకే ఏడాదిలో రెండు టైటిళ్లు (ర్యాపిడ్, బ్లిట్జ్) సాధించిన రెండో జీఎంగాను అర్జున్ నిలిచాడు. మొత్తంగా సహచర భారత ప్లేయర్లు నిరాశపరిచిన చోట తన సత్తా ఏంటో చేతల్లో చూపెడుతూ అర్జున్ కాంస్య మోత మోగించాడు.

శ్రీలంక వైట్ వాష్...

చివరి మ్యాచ్‌లోనూ టీమిండియా గెలుపు

పొట్టి సిరీస్‌లో శ్రీలంకను భారత జట్టు వైట్‌వాష్ చేసింది. హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ గెలుపొందిన టీమిండియా.. చివరి మ్యాచులోనూ లంకను చిత్తుగా ఓడించింది. మంగళవారం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (68) విధ్వంసక ఆటతో చెలరేగి భారీ స్కోర్ అందించింది. పవర్ ప్లేలోనే రెండు వికెట్లు పడినా అమన్‌జోత్ కౌర్(21), అరుంధతి రెడ్డి(27)లు రాణించారు. 176 పరుగులు ఛేదనలో హాసిని పెరీరా(65), ఇమేశా దులానీ(50)లు పోరాడినా లంకను గెలిపించలేకపోయారు. ఐదుకు ఐదు మ్యాచుల్లో పర్యాటక జట్టును మట్టికరిపించిన హర్మన్‌ప్రీత్ సేన విశ్వవిజేతగా తొలి సిరీస్‌ను 50తో అందుకుంది. స్వదేశంలో వన్డే ప్రపంచకప్ విజేతగా చరిత్ర సృష్టించిన భారత్ తొలి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. వరల్డ్ కప్ అందుకున్నాక ఇకపై విజయాన్ని, ట్రోఫీలను గెలవడం ఒక అలవాటుగా మార్చుకుంటాం అని చెప్పిన హర్మన్‌ప్రీత్ కౌర్ తొలి అడుగు ఘనంగా వేసింది. రెండేళ్ల క్రితం ఆసియా కప్ ఫైనల్లో ఓడించిన శ్రీలంకను వైట్‌వాష్ చేస్తూ పొట్టి సిరీస్ కైవసం చేసుకుంది టీమిండియా. ఐదో టీ20లో ఓపెనర్ షఫాలీ వర్మ(5) విఫలమైనా.. హర్మన్‌ప్రీత్ కౌర్(68) ఖతర్నాక్ అర్ధ శతకంతో జట్టుకు కొండంత స్కోర్ అందించింది. అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి లంక గెలుపు ఆశలపై నీళ్లు చల్లారు.. ఐదు మ్యాచ్‌ల పొట్టి సిరీస్‌ను టీమిండియా క్లీన్‌స్వీప్ చేయడం ఇది మూడోసారి. 2019లో వెస్టిండీస్‌ను, 2024లో బంగ్లాదేశ్‌ను ఐదుకు ఐదు మ్యాచుల్లో ఓడించింది భారత్. చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలనున్న శ్రీలంకకు భంగపాటే ఎదురైంది. భారీ ఛేదన ఆరంభంలోనే చమరి ఆటపట్టు (2)ను డైవింగ్ క్యాచ్‌తో ఔట్ చేసిన దీప్తి శర్మ లంకకు షాకిచ్చింది. ఆ తర్వాత.. హాసిని పెరీరా(65), ఇమేశా దులానీ(50) దూకుడుగా ఆడారు. ఇద్దరూ స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంటూ స్కోర్‌బోర్డును నడిపించారు. ముఖ్యంగా దులానీ కళాత్మక షాట్లతో అలరిస్తూ టీ20ల్లో తొలి అర్ధ శతకం నమోదు చేసింది.

పొట్టి ఫార్మాట్‌లో.. వికెట్ల మహారాణి

భారత మహిళల జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ చరిత్ర సృష్టించింది. టీ20ల్లో అత్యధిక వికెట్లతో దీప్తి రికార్డు నెలకొల్పింది. త్రివేండ్రంలో శ్రీలంకతో జరిగిన ఐదో మ్యాచ్‌లో తను 152వ వికెట్ సాధించింది. నాలుగో మ్యాచ్‌కు ముందు 151 వికెట్లతో ఆస్ట్రేలియా పేసర్ మేఘన్ షట్ రికార్డు సమం చేసిన దీప్తి.. నీలాక్షి డిసిల్వాను ఔట్ చేసి అగ్రస్థానికి దూసుకెళ్లింది. అన్ని ఫార్మాట్లలో అత్యధిక వికెట్ల జాబితాలో దీప్తి మూడో స్థానంలో కొనసాగుతోంది. మూడు ఫార్మాట్లలో అత్యధిక వికెట్లు తీసిన రికార్డు భారత్‌కే చెందిన ఝులాన్ గోస్వామి పేరిట ఉంది. ఈ మాజీ స్పీడ్‌స్టర్ 355 వికెట్లతో టాప్‌లో ఉండగా.. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ క్యాథరీన్ సీవర్ బ్రంట్ 335 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతోంది. దీప్తి శర్మ 334 వికెట్లతో మూడు, ఎలీసా పెర్రీ 331 వికెట్లతో నాలుగో స్థానంలో ఉన్నారు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సోఫీ ఎకిల్‌స్టోన్ 323 వికెట్లతో ఐదో ర్యాంక్‌లో నిలిచింది.

గిల్ టీ20 జట్టులోకి త్వరలోనే వస్తాడు

- హర్భజన్ సింగ్

టీ20 ప్రపంచ కప్ 2026కి సంబంధించి ఇప్పటికే టీమిండియా జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మెగా టోర్నీ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుండగా.. భారత్‌శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. అయితే ప్రపంచ కప్ జట్టులో అనూహ్యంగా శుభ్‌మన్ గిల్ తన వైస్ కెప్టెన్సీతో పాటు, జట్టులో స్థానాన్నీ కోల్పోయాడు. సెలక్టర్లు తీసుకున్న ఈ నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే గిల్ టీ20 మ్యాచుల్లో వరుసగా వైఫల్యమవుతున్నందున బీసీసీఐ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ ఈ విషయంపై స్పందించాడు. 'టీమిండియాకు ఎంపిక విషయంలో తీవ్రమైన పోటీ ఉన్న విషయం వాస్తవమే. అయితే గిల్ కు దారులన్నీ మూసుకుపోయినట్లు కాదు. అతడు తిరిగి టీ20 జట్టులోకి వస్తాడు. శుభ్‌మన్ అద్భుతమైన ఆటగాడు. అతడు కచ్చితంగా పునరాగమనం చేస్తాడు. అలాగే గిల్ టెస్ట్ కెప్టెన్ అన్న విషయం మర్చిపోవద్దు. కాంబినేషన్ వల్ల గిల్‌కు టీ20 జట్టులో చోటు దక్కలేదని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వివరణ ఇచ్చారు. పరిస్థితులు, కాంబినేషన్ వల్లే వాళ్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. గిల్ ఒక క్లాస్ ప్లేయర్. అతడు జట్టులోకి తిరిగి వస్తాడన్న విషయంలో నాకు ఎలాంటి అనుమానం లేదు' అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.

మెగా విక్టరీ మాస్ సాంగ్ లాంచ్

మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేష్ కలిసి నటిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థర్డ్ సింగిల్ మెగా విక్టరీ మాస్‌లో వారి డైనమిక్ కెమిస్ట్రీ అదిరిపోయింది. ఇది ఎక్సయిట్మెంట్ ని మరింతగా పెంచింది. ప్రేక్షకులను అలరించే సాంగ్స్ రూపొందించడంలో ప్రసిద్ధి చెందిన భీమ్స్ సిసిరోలియో, పండుగ పల్స్, డ్యాన్స్‌ఫ్లోర్ ఎనర్జీతో నిండిన మరో అద్భుతమైన ట్రాక్‌ను అందించారు. నక్ష్ అజీజ్, విశాల్ దద్లాని పవర్ ఫుల్ వోకల్స్ అందిస్తూ పాటలో ఎనర్జీ నింపారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం పక్కా మాస్ టచ్‌తో పాటు నాస్టాల్జియా ఫీల్‌ని మేళవించి, ఈ స్టార్ స్టడెడ్ రీయూనియన్‌కి పర్ఫెక్ట్‌గా నిలిచింది. స్టైలిష్ పబ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన ఈ పాటలో ఇద్దరు పవర్‌హౌస్ పెర్ఫార్మర్లు అదరగొట్టారు. చిరంజీవి మెగాస్టార్ ఆరా, వెంకటేష్ క్లాసీ చార్మ్ కలిసి ప్రతి ఫ్రేమ్ అద్భుతంగ వుంది. ఇద్దరి డాన్స్ మూవ్స్, కలర్‌ఫుల్ కాస్ట్యూమ్స్, సిగ్నేచర్ స్వాగ్ ఈ పాటను విజువల్-మ్యూజికల్ స్పెక్టకిల్‌గా నిలబెట్టాయి. కోరియోగ్రాఫర్ విజయ్ పోలకి హైవోల్టేజ్ స్టెప్పులతో పాట ఎనర్జీని మరింత పెంచారు. చిరంజీవి గారి ట్రేడ్‌మార్క్ గ్రేస్, వెంకీ గారి కూల్ స్టైల్.. ప్రతి బీట్ పండుగ ఉత్సాహాన్ని తాకేలా వుంది. ఈ ట్రాక్ ఒక విజువల్ ఫీస్ట్, మ్యూజికల్ ట్రీట్..ఫ్యాన్స్‌కి పర్ఫెక్ట్ న్యూ ఇయర్ సెలబ్రేషన్.చిరంజీవి, వెంకటేష్, అనిల్ రావిపూడి కలయిక మొదటి నుంచే భారీ ఆసక్తిని రేపగా, ఈ పాట ఆ క్యూరియాసిటీని మరింత పెంచింది. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్నారు.

'ఒక పేరే అలరారు..'

'జన నాయకుడు' సాంగ్ రిలీజ్..

దళపతి విజయ్ హీరోగా నటిస్తోన్న 'జన నాయకుడు'. ప్రముఖ నిర్మాణ సంస్థ కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హెచ్.వినోద్ దర్శకత్వంలో సినిమా రూపొందుతోంది. సంక్రాంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున జనవరి 9న ఈ సినిమా రిలీజ్ కానుంది. మూవీపై భారీ అంచనాలున్నాయి. తాజాగా మేకకర్స్ ఈ సినిమా నుంచి 'ఒక పేరే అలరారు..' అనే లిరికల్ వీడియో సాంగ్‌ను రిలీజ్ చేశారు. పాటకు అభిమానులు, ప్రేక్షకుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. దీంతో సినిమాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్ మరింత పెరిగాయి. రాక్‌స్టార్ అనిరుద్ రవిచందర్ సంగీత సారథ్యం వహిస్తోన్నజన నాయకుడు సినిమాలోని ఈ పాటను తెలుగులో శ్రీనివాస మౌళి రాయగా, శ్రీకృష్ణ, విశాల్ మిశ్రా ఆలపించారు. పాటలోని బలమైన సాహిత్యం దానికి తగ్గ బీట్ అందరినీ మెప్పిస్తోంది. తన అభిమానులతో దళపతి విజయ్‌కున్న గాఢమైన అనుబంధాన్ని ఈ పాట ద్వారా వ్యక్తం చేశారు. అన్నీ డిజిటల్ ఫ్లాట్‌ఫామ్స్‌లో పాట దూసుకెళ్తోంది.కెవిఎన్ ప్రొడక్షన్స్ నుంచి వస్తోన్న తొలి పాన్ ఇండియా మూవీ 'జన నాయకుడు' కావటం ఓ ప్రత్యేకత. అలాగే విజయ్ కెరీర్‌లోనే ఇదొక మైల్ స్టోన్ మూవీ. ఇంతకు ముందు ఈ సినిమా నుంచి వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే.. అందులో ఆయన తన అభిమానులతో కలిసి ఓ సెల్ఫీ తీసుకుంటూ కనిపించారు. దీనికి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. అభిమానులతో ఆయనుకున్న బలమైన, ప్రత్యేకమైన అనుబంధాన్ని ఈ పోస్టర్ ద్వారా తెలియజేశారు.

'బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్'

కొత్త నిర్మాణ సంస్థను అనౌన్స్ చేసిన బండ్ల గణేష్

నటుడిగా కెరీర్ ప్రారంభించి, ఆ తర్వాత నిర్మాతగా మారిన బండ్ల గణేష్, మాస్ మహారాజా రవితేజ నటించిన 'అంజనేయులు' చిత్రంతో సినీ నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. ఈ సినిమాతోనే ఆయన తన సొంత బ్యానర్ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్'ను ప్రారంభించారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన సంచలన బ్లాక్‌బస్టర్ 'గబ్బర్ సింగ్' చిత్రంతో ఈ బ్యానర్‌కు మొదటి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ లభించింది. ఈ సినిమా బండ్ల గణేష్‌ను ఒక విజయవంతమైన నిర్మాతగా సుస్థిరం చేసింది. ఆ విజయం స్ఫూర్తితో, ఈ బ్యానర్ 'బాద్‌షా', 'ఇద్దరమ్మాయిలతో', 'టెంపర్' వంటి అనేక ప్రతిష్టాత్మక, కమర్షియల్ గా విజయవంతమైన చిత్రాలను నిర్మించి తెలుగు సినిమాలో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ఇప్పుడు తన కొత్త నిర్మాణ సంస్థ 'బండ్ల గణేష్ బ్లాక్‌బస్టర్స్' (బీజీ బ్లాక్‌బస్టర్స్) ని అనౌన్స్ చేశారు. ఈ కొత్త అధ్యాయాన్ని మరింత ప్రత్యేకంగా మార్చే విషయం ఏమిటంటే, ఇందులో నెక్స్ట్ జనరేష్ భాగస్వామ్యం కావడం.బీజీ బ్లాక్‌బస్టర్స్ బ్యానర్ ద్వారా మనసుకి దగ్గరగా ఉండే సినిమాలు, నిజాయితీతో కూడిన కథలు, కంటెంట్ రిచ్ చిత్రాలను ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో బండ్ల గణేష్ ముందుకు సాగుతున్నారు. కొత్త ఆలోచనలు, వినూత్న కథనాలు, ఫ్రెష్ టాలెంట్‌కు అవకాశం ఇవ్వడమే ఈ బ్యానర్ ప్రధాన ఉద్దేశం.

స్టార్ బాయ్ కొత్త చిత్రం ఖరారు

మూడోసారి చేతులు కలిపిన సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్

తన ప్రత్యేకమైన కథా ఎంపికలు, శక్తివంతమైన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, తన ఆరో చిత్రానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదలైన అద్భుతమైన పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సిద్ధు జొన్నలగడ్డ, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కలయికలో వస్తున్న మూడో చిత్రమిది. గతంలో వీరి కలయికలో వచ్చిన డీజే టిల్లు, టిల్లు స్క్వేర్ సినిమాలు భారీ విజయం సాధించాయి. ఇప్పుడు వారు హ్యాట్రిక్ కోసం సన్నద్ధమవుతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తన ప్రత్యేకమైన కథన శైలితో గుర్తింపు పొంది, తెలుగు చిత్రసీమలో ప్రతిభగల యువ దర్శకులలో ఒకరిగా పేరుగాంచిన స్వరూప్ ఆర్ఎస్‌జే.. ఈ ప్రతిష్టాత్మక చిత్రం యొక్క కథ, కథనం మరియు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అద్భుతమైన కథాకథనాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించనున్నారు. ఈ సినిమాలో సిద్ధు జొన్నలగడ్డను కొత్తగా, గాఢమైన, అదే సమయంలో వినోదాత్మకమైన అవతారంలో చూడబోతున్నాము. నిరంతరం తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడంలో పేరుగాంచిన సిద్ధు జొన్నలగడ్డ, నటుడిగా తనను సవాలు చేసే కథలను ఎంచుకోవడంలో మరియు ప్రేక్షకులను మరింత లోతుగా ఆకట్టుకోవడంలో తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు.

ఓం శాంతి శాంతి శాంతిః సాంగ్ రిలీజ్

ట్యాలెంటెడ్ ఫిల్మ్ మేకర్స్ తరుణ్ భాస్కర్ తన అద్భుతమైన నటనతో కూడా అలరిస్తున్నారు. ఆయన లీడ్ రోల్ లో నటిస్తున్న చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఏఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం, సహజమైన హాస్యం, ఆకట్టుకునే డ్రామాతో కూడిన వినోదభరితమైన విలేజ్ కామెడీ. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ వెంచర్‌ను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది.ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ సింగిల్ సిన్నారి కోన సాంగ్ ని రిలీజ్ చేసిన మ్యుజికల్ జర్నీ కిక్ స్టార్ట్ చేశారు. అప్పగింతలు బ్యాక్ డ్రాప్ లో కంపోజర్ జయ కృష్ణ ఈ సాంగ్ బ్యూటీఫుల్ మెలోడీగా స్వరపరిచారు. జయ కృష్ణ, అనన్య భట్ , ఎం.జి. నరసింహ వోకల్స్ పాటకు ఫీల్ ని తీసుకొచ్చాయి. భరద్వాజ్ గాలి రాసిన సాహిత్యం అందరినీ ఆకట్టుకుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200